Rs. 12/- per copy

UESI

# విద్యార్థి జ్వాల

Vol. 29 - No.1

November 2022



ప్రేమతో, ఐక్యతతో

## ముందుకు సాగుదాం!

# పిలుపుకు తగినట్లుగా నడచుకొందాం

తనకు జన్మించిన కుమారులు, కుమార్తెలు తన అద్వితీయ కుమారుని పోలి నడచుకోవడమే, దేవుని అత్యున్నత ఉద్దేశం. మానవుల పట్ల తండ్రియైన దేవునికున్న ప్రణాళిక మానవ ఊహకు, మేధస్సుకు అందదు. రక్షణ పొందడం అనే అనుభవం ఈ గొప్ప ప్రణాళికలో కేవలం ఒక ప్రారంభదశ మాత్రమే. ఈ అనుభవం ద్వారా, ఒక సామాన్యమానవుని ఊహకు అందని, దేవదూతలకు కూడా అంతుపట్టని గొప్ప నిత్య ప్రణాళికలోనికి ప్రవేశిస్తాడు. తద్వారా దేవుని గొప్ప కుటుంబంలోనికి చేర్చబడతాడు. అప్పటినుండి ప్రతి విశ్వాసి దేవుని కుమారునితో సహవాసం చేయడానికి పిలవబడతాడు (1కొరింథీ 1:9). ఈ రెండవ అను భవము మానవ జ్ఞానానికి అందదు. సర్వసృష్టికర్త, సర్వాధిపతి, సర్వశక్తిమంతుడు, సర్వవ్యాపియైన దేవుడు, ఎందుకు కొరగాని పాపశరీరాకారముగల, తృణీకరింపబడిన మానవుని తన కుమారునితో సహవాసానికి పిలవడం ఒక విశ్వాసి జీవితంలో అత్యంత విలువైన ఆహ్వానము. పిలిచిన వాని గొప్పతనం, అంతస్థు, ఉనికి, సామర్థ్యం పిలవబడిన విశ్వాసికి అర్థమైతే దానిని ఎంతో వినమ్రతతో లక్ష్యపెడతాడు. కానీ అనేకులైన విశ్వాసుల జీవితాలలో ఇది సత్యముకాదు. ఈ కారణము చేత పౌలు భక్తుడు విశ్వాసులను హెచ్చరి స్తూ, ఆయన పిలుపుకు తగినట్లుగా అనగా ఆ పిలు పు యొక్క విశిష్టతను, విలువను ఎరిగి తమ ఇహలోక జీవిత నడత విషయంలో తగు జాగ్రత్త తీసికొనవలెనని ప్రాధేయపడుచున్నాడు (ఎఫెసీ 4:3).

పౌలు భక్తునికి తనను పిలిచినవాడు ఎవరో తెలిసినప్పటికి ఆయనను గూర్చిన పూర్ణజ్ఞానము లేదు. ఆయనను గూర్చి ఎరుగునిమిత్తము, ఆయన పునరుత్థాన బలమును ఎరుగునిమిత్తము పౌలు తన జీవితములో తనకు లాభకరముగానున్న అనేకమైన ఇహలోక అంతస్థులు, గొప్పలు, అర్హతలు మొదలగువాటన్నిటిని పెంటతో సమానంగా ఎంచుకొన్నాడు (ఫిలిప్పీ 3:11). క్రీస్తు ప్రభువును, ఆయనను గూర్చిన సత్యాన్ని తెలు సుకొనే ప్రయత్నంలో పౌలు భక్తునికి మిగిలిన విషయాలు విలువ లేనివిగా మారిపోయినవి. ఆయనను ఎరిగిన కొలది పౌలు భక్తుని జీవితంలో, ప్రవర్తనలో, నడతలో విప్లవాత్మకమైన మార్పును అనుభవించాడు. ఈ మార్పు 1 కొరింథీ 11:1లో నేను క్రీస్తును పోలి నడచుకొనుచున్నాననే గొప్ప ప్రకటనకు దారితీసింది.

నడతకు ముందు సత్యము అర్థం కావాలి. సత్యము అర్థమవడమనేది కేవలం బోధించడంవలన సాధ్యమవుతుంది. విశ్వాసి జీవితంలో పరిశుద్ధాత్మ దేవుడు బోధించకుండా సత్యము మనసుకు గ్రాహ్యంకాదు. సత్యమును గూర్చి పాడడం, వినడం, దేవుని వాక్యమును కంఠస్థంచేయడం, బోధించడంలాంటి కార్యములు కొంత లాభకరములైనప్పటికీ ఆత్మదేవుని ద్వారా బోధించబడకపోతే ఆ సత్యము నడతలోనికి రాదు. పరిశుద్ధాత్మ దేవుని యొక్క ఒక ప్రాముఖ్యమైన పని, విశ్వాసిని సర్వసత్యములోనికి నడిపించడం (యోహాను 16:13). సర్వసత్యములోనికి నడిపించడం అనగా క్రీస్తు ప్రభువును గూర్చిన సత్యము యొక్క అవగాహనలోనికి ఆ వ్యక్తి మనసును, గ్రాహ్యమును నడిపించుట. ఈ ప్రక్రియలో మనస్సు అతి ప్రాముఖ్యత వహిస్తుంది. పరి శుద్ధాత్మ దేవుడు, విశ్వాసి మనసునకు క్రీస్తు ప్రభువును గూర్చిన సత్యమును అనగా ఆయన ఇష్టమును, ఆయన వ్యక్తిత్వమును, ఆయన ఉద్దేశములను, మనుష్యులపట్ల, వస్తువుల పట్ల ఆయన దృక్పథమును బోధిస్తుండగా మనసు కొంచెం కొంచెంగా అర్థంచేసుకొంటుంది. ఇది ఒక్కసారి జరిగే అనుభవంకాదు గాని విశ్వాసి దినదినము దేవుని పాదముల దగ్గర ఆశతో, ఆత్మీయ ఆకలితో దేవుని వాక్యధ్యానంలో దేవుని స్వరాన్ని వినడం ద్వారా (యోహాను 10:27) తన మనసు రూపాంతరం (మార్పు) చెందుతూ ఉంటుంది (రోమా 12:2). మనసులో జరిగే ఈ మార్పు ఆ వ్యక్తి జీవిత విధానం, ప్రవర్తన, ఇతరుల పట్ల వస్తువుల పట్ల విశ్వాసి దృక్పథాన్ని విపరీతంగా ప్రభావితం చేస్తుంది.

పరిశుద్ధాత్మ దేవుడు విశ్వాసిలో నివసిస్తూ అతనిలో లేక ఆమెలో కలుగజేసే ఈ మార్పుద్వారానే, క్రీస్తు ప్రభువుకు తగినట్లుగా నడచుకొనగలం.

విశ్వాసికి మనసు ఎంతో ప్రాముఖ్యం. మన మనసు లోపలకు ప్రతి రోజు ఎంత సత్యమును పంపగ లుగుచున్నాము? మనసు లోపలకు ప్రవేశించిన దైవసత్యము జీవితములోనుండి బయటకు వస్తే దానిని నడత అంటారు. దేవుని సత్యము జీవితములోనికి వచ్చి తీరాలి. అది మన చుట్టువున్న అవిశ్వాసులకు కనబడాలి. అప్పుడే ఆయన పోలిక మన ప్రేమలోను (ఎఫెసీ 5:2), మన సంబంధాలలోను (ఎఫెసీ 5:3), మన మాటలలోను (ఎఫెసీ 5:4), మన ఆశలలోను (ఎఫెసీ 5:5) వ్యక్తమవుతుంది.

**– కె. దేవిడ్‌రాజ్ కుమార్,** గుంటూరు

# విద్యార్థి జ్వాల



Vol. 29, No.1 November 2022
A Publication of
UESI Publication Trust

EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Honorary Editor
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Dr. J. Subbarao - Sec., Litt.Dept.

CONTACT:

The Editor, Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com

GIFTS & SUBSCRIPTIONS:

Can be made by Cheque/DD/MO
in favour of UESI-AP,
Abhishek Nagar, Nambur - 522 508
ANNUAL: GRADUATES - Rs.250
STUDENTS - Rs. 120
LIFE INLAND - Rs. 2000
LIFE OVERSEAS - US $ 150

VIDYARTHI JWALA ACCOUNT NO:

**SBI - 36698741798**
**IFS Code: SBIN0011994**
**uesiap vj, Nambur Branch**

GENERAL CONTRIBUTIONS ACCOUNT NO:

**SBI - 10949477628**
**IFS Code: SBIN0000844**
**Commercial Branch, Guntur**

LITERATURE ACCOUNT NO:

**SBI - 36698741437**
**IFS Code: SBIN0011994**
**uesiap pt, Nambur Branch**

**Please inform/ SMS to**
**Mr. A. Venu, Accountant (9849516060)**
**Email: <uesiapacc84@gmail.com>**

TOPICS:

December: Why Jesus is so unique?

January 2023: God's Guidance

February: Discipleship

**Note:** Please send your writeups on or before
**10th of every month**

# ఐక్యతతో జీవిద్దాం

“మీరు నన్ను ఏర్పరచుకొనలేదు... నేను మిమ్మును ఏర్పరచుకొని నియమించితిని” అని యేసయ్య తన శిష్యులతో చెప్పాడు (యోహాను 15:16). బహుశా మన సహవాసం గూర్చి అయితే ప్రభువు “మీరు ఒకరినొకరు ఏర్పరచుకొనలేదు, నేను మిమ్మును ఒకరికి ఒకరుగా ఉండాలని ఏర్పరిచితిని” అని చెప్పివుండేవారని ప్రఖ్యాత క్రైస్తవ మేధావి సి.యస్.లూయిస్ అంటారు. ఇది ముమ్మాటికి ప్రతి క్రైస్తవ సహవాసం పట్ల, మరి ముఖ్యంగా యుఇయస్ఐ సహవాసం పట్ల సత్యం. ప్రభువు పిలుపు మన భాగ్యం. ఈ పిలుపు మన నిరీక్షణతో ముడిపడింది (ఎఫెసీ1:18).

ఇదే విషయాన్ని పౌలు భక్తుడు ఎఫెసీ సంఘానికి రాసిన పత్రికలో ప్రస్తావించాడు (ఎఫెసీ 4:1-3). ప్రభువు పిలుపు కేవలం వ్యక్తిగతమైనది మాత్రమే కాదు, అది సహవాసం కొరకు కూడా. క్రైస్తవ జీవితంలోని హక్కులు, బాధ్యతలు ఈ పిలుపులో భాగంగానే ఉంటాయి. ఈ గొప్ప పిలుపును నెరవేర్చడానికి అవసరమైన శక్తి సహవాసంలోని ప్రతి వ్యక్తికి వ్యక్తిగతంగా ‘సంపూర్ణ వినయం’ ‘సాత్వీకము’ కలిగి ఉండడం ద్వారానే వస్తుంది. ఇవి సహవాసాన్ని ప్రభావితం చేస్తాయి. దీర్ఘశాంతం కనపరచడానికి, ప్రేమతో ఒకరినొకరు సహించడం, సహవాసంలో ఐక్యతను కాపాడుకోవడం అనివార్యం. ‘ఐక్యత’ క్రైస్తవ లక్షణాలలో అతి ప్రాముఖ్యమైనది, అది త్రియేక దేవుని సహజ స్వభావంలో అంతర్భాగం.

ప్రాధాన్యత లేని చిన్న చిన్న కారణాలతో విచ్ఛిన్నమైపోతున్న ప్రస్తుత సమాజంలో పిలుపుకి తగినట్లు మన ప్రభువును ప్రతిబింబిస్తూ ఐక్యతతో జీవించడం మనందరి బాధ్యత.

**– డి. అనిల్ కుమార్,** వైజాగ్

## లోపలి పేజీల్లో...

- పిలుపుకు తగినట్లుగా నడచుకొందాం- 2
- ఐక్యతతో జీవిద్దాం - 3
- ప్రేమతో, ఐక్యతతో ముందుకు సాగుదాం- 4
- వారసత్వాన్ని అందించు - 9
- నేర్చుకొన్న పాఠాలు - 13
- డిజిటల్ వ్యసనం - 16
- మన తరానికి సేవచేయడం - 17
- ప్రభావవంతమైన సౌవార్తీకరణ - 20
- పెళ్ళి-దేవునిచిత్తం - 22
- అనుకూల సమయం - 23
- ఆత్మీయ జ్వాల- 28
- క్రాస్ వర్డ్ పజిల్ - 30
- కోశాధికారి లేఖ - 31
- చేదువేరు- 32



# ప్రేమతో, ఐక్యతతో ముందుకు సాగుదాం!

ఇంటర్వ్యూకి చాలామంది వస్తున్నారు. వారిలో ఒకడు చాలా భయము బెరుకు లేకుండా, నిబ్బరంగా వచ్చాడు. అతను ఎమ్మెల్యే రికమండేషన్ కేండిడెట్. ఉద్యోగం నాకే వస్తుందన్న ధీమా అతనిలో కనబడుతుంది. రికమండేషన్ లెటర్ కూడా పాకెట్‌లో పెట్టుకొని వచ్చాడు. మిగిలినవారు చాలా భయం భయంగా వచ్చి కూర్చొంటే, ఇతను మాత్రం చాలా హుందాగా కూర్చొన్నాడు. ఇంటర్వ్యూ చేసేవారు మాట్లాడుకొంటూ, ఎంతమంది వచ్చినా ఉద్యోగం వీడికే ఇవ్వాలి కదా! మనస్సాక్షిని చంపుకొని ఎలా ఇవ్వాలి? ఏవో కొన్ని తేలికపాటి ప్రశ్నలు అడిగి ఉద్యోగమిచ్చేద్దాం అనుకొని అతనిని పిలిపించారు. రాగానే పాకెట్‌లో ఉన్న లెటర్ తీసి ఇవ్వబోతే వద్దు కొన్ని ప్రశ్నలకి మాత్రం సమాధానం చెప్పు నీకే ఉద్యోగమిచ్చేస్తాం అని చెప్పారు. అడగండి చెప్తాను అన్నాడు.

భారత రాష్ట్రపతి పేరేంటి? అని అడిగారు.

వావ్ ఇంత సింపుల్ ప్రశ్నా? 'సచిన్ టెండూల్కర్' అని తడుముకోకుండా చెప్పాడు.

'సరే బాగా చెప్తున్నావు కాఫీకి స్పెల్లింగ్ చెప్పు' అన్నారు.

వెంటనే ఆలోచించకుండా 'కెఏయఫ్ఐ' అని అన్నాడు.

వాళ్ళకు ఒళ్ళుమండి ఒక్క లెటర్ సరిగ్గా చెప్పినా, ఉద్యోగం నీకే ఇచ్చేవాళ్ళమని చెప్పి, అతన్ని తోసేసి 'పో నీకు ఉద్యోమిచ్చేది లేదని' అన్నారు. ఎందుకు ఇది చెప్పానంటే మనం ఎక్స్‌పొజిషన్స్, ప్లీనరీస్, సెమినార్స్, కీనోట్, డివోషన్స్ అన్నీ విని ఏమి నేర్చుకోకుండా వెళ్ళిపోతే, ఒక విషయం కూడా మన జీవితంలోకి రాకపోతే దేవుడు మనలను కూడా తోసేస్తాడేమో జాగ్రత్తగా, సీరియస్‌గా విని పాటిస్తే దేవుడు మనల్ని ఆశీర్వదిస్తాడని నమ్ముచున్నాను.

ఫిలిప్పీ 2:1-4 చదువుదాం: కావున క్రీస్తునందు ఏ హెచ్చరికయైనను, ప్రేమ వలన ఆదరణయైనను, ఆత్మయందు ఏ సహవాసమైనను, ఏ దయారసమైనను, వాత్సల్యమైనను ఉన్నయెడల మీరు ఏకమనస్కులగునట్లుగా ఏకప్రేమకలిగి, ఏక భావముగలవారుగా ఉండి, ఒక్కదానియందే మనస్సుంచుచు నా సంతోషమును సంపూర్ణము

చేయుడి. కక్షచేతనైనను వృథాతిశయముచేతనైనను ఏమియు చేయక, వినయమైన మనస్సుగలవారై యొకనినొకడు తనకంటె యోగ్యుడని యెంచుచు మీలో ప్రతివాడును తన సొంతకార్యములను మాత్రమేగాక యితరుల కార్యములను కూడ చూడవలెను.

## ప్రేమతో, ఐక్యతతో ఎలా ముందుకుసాగగలం?

ఫిలిప్పీ 2:1–4లో పౌలు చెప్పిన లక్షణాలను ఆధారం చేసుకొని మూడు విషయాలు చూద్దాం.

1. ఆత్మసంబంధమైన ఐక్యతకు కారణాలు.
2. ఐక్యతను చల్లార్చేవి
3. ప్రమాదాలను అధిగమించడం వలన వచ్చే ఫలితాలు


## 1. ఆత్మసంబంధమైన ఐక్యతకు కారణాలు

### ఎ. యేసుక్రీస్తులో మనకు ప్రోత్సాహం దొరికింది (ఫిలిప్పీ 2:1)

ఎన్నో ప్రతికూలతల మధ్య ఆత్మసంబంధమైన ఐకమత్యంతో ప్రేమతో ముందుకు వెళ్ళడానికి యేసుక్రీస్తులో ఉన్న వాటన్నిటినీ ఆధారం చేసుకోవాలి. క్రీస్తులో ఏమున్నాయంటే...

'క్రీస్తునందు ఏ హెచ్చరికయైనను' ఆదిమ గ్రీకు భాషలో హెచ్చరికకు 'క్రీస్తునందు ఏ ప్రోత్సాహమైనను' అని అర్థం. మన ప్రభువైన యేసుక్రీస్తులో ప్రోత్సాహానికి కొదవలేదు. ప్రభువు 'నేను మిమ్మును ప్రేమించినట్లు మీరును ఒకరినొకరు ప్రేమించుకొండి' అని అన్నాడు. అపోస్తలుడైన యోహాను తన మొదటి పత్రిక 2:6లో 'ఆయన ఎలా నడుచుకొన్నాడో మనము ఆలాగు నడచుకొనబద్ధులమై యున్నాము'. అంటే యేసులాగ ప్రేమించగలం, యేసులా నడవగలం, యేసులా జీవించగలం.

యేసుప్రభువు జీవించి, మనల్ని కూడా ఆయనవలె జీవించమన్నాడు. 1 పేతురు 2:21). మనం యేసులాగా ప్రేమించగలం, జీవించగలం. ఇది మనకు ప్రోత్సాహాన్నిస్తుంది. సాతానుడు 'యేసుప్రభువు స్టాండర్డ్ ఎక్కడో ఉంటుంది, నీవు అలా నడవగలవా? అనే సందేహాన్ని తీసుకొస్తాడు. సాతాను చెప్పే అబద్ధాలు, మాటలు వినవద్దు. ఆయన ఎట్టివాడైయున్నాడో మనమూ అట్టివారిలా జీవించగలం గనుక విశ్వాసముతో యేసు మాటలు నమ్మాలి. సాతానా నా యేసు ప్రేమించినట్టే నేను ప్రేమించగలను. యేసు నడచుకున్నట్లుగా నేను నడవగలను, యేసు జీవించినట్లు నేను జీవించగలను అని సాతానుతో చెప్పండి. నేను పడిపోయినా నా ప్రభువు మరలా నన్ను లేవనెత్తుతాడు. సాతానా నీవు పడిపోయి ఇంతవరకు లేవలేదు అని సాతానుతో చెప్పండి. "నా శత్రువా, నామీద అతిశయింపవద్దు, నేను క్రిందపడినను, తిరిగి లేతును; నేను అంధకారమందు కూర్చున్నను యెహోవా నాకు వెలుగుగా నుండును. నేను యెహోవా దృష్టికి పాపము చేసితిని గనుక ఆయన నా పక్షమున వ్యాజ్యెమాడి నా పక్షమున న్యాయము తీర్చువరకు నేను ఆయన కోపాగ్నిని సహింతును; ఆయన నన్ను వెలుగులోనికి రప్పించును, ఆయన నీతిని నేను చూచెదను. (మీకా 7:8,9). యేసుక్రీస్తు వలన మనకందిన ప్రోత్సాహమిది.




నేను పడిపోయినా నా ప్రభువు మరలా నన్ను లేవనెత్తుతాడు. సాతానా నీవు పడిపోయి ఇంతవరకు లేవలేదు అని సాతానుతో చెప్పండి.

### బి. క్రీస్తు ప్రేమవలన మనకు ఆదరణ దొరికింది (ఫిలిప్పీ 2:1)

కష్టాల్లో, ఇబ్బందుల్లో మనుష్యులు ఇచ్చే ఆదరణ వేరుగా ఉంటుంది. పైకి సానుభూతి చూపించినా లోపల వీరికి ఇలానే జరగాలని అనుకొంటారు. కానీ యేసుక్రీస్తు ఇచ్చే ఆదరణ దీనికి భిన్నంగా ఉంటుంది. "మన ప్రభువైన యేసుక్రీస్తును, మనలను ప్రేమించి, కృపచేత **నిత్యమైన ఆదరణయు,** శుభ నిరీక్షణయు అనుగ్రహించిన మన తండ్రియైన దేవుడును, మీ



**నరకానికి వెళ్ళేవారిని చూసినప్పుడు మనకు ఏడుపు రావడంలేదు. మన కళ్ళల్లో నీళ్ళు ఎండిపోయాయి, కళ్ళల్లో నీళ్ళు రావడం లేదు. ఇవిలేని నాడు మనం ఏక ప్రేమలోకి రానట్లే. పరిశుద్ధుల కొరకైన ప్రసవవేదన, పాపులకొరకైన పరితపించే మనస్సు ఈ రెండూ మనలో కలగకపోతే ఈ కాన్ఫరెన్స్ వృథానే.**

హృదయములను ఆదరించి, ప్రతి సత్కార్యమందును ప్రతిసద్వాక్యమందును మిమ్మును స్థిరపరచును గాక (2 థెస్స 2:16,17). యేసుక్రీస్తు ప్రభువు ఇచ్చేది నిత్యమైన ఆదరణ. ఇదే మనం ఒకరికొకరం ఇచ్చుకోవాల్సింది. అప్పుడు ప్రేమతో, ఐకమత్యంతో మనము ముందుకు సాగగలం.

### సి. యేసుక్రీస్తులో మనకు ఆత్మయందు సహవాసం దొరికింది (ఫిలిప్పీ 2:1)

ఆత్మయందు సహవాసం మనకు ఎలా దొరికిందంటే 1కొరింథీ 3:16 ప్రకారం పరిశుద్ధాత్ముడు మనలోకి వచ్చి నివసిస్తున్నాడు, మనలో పనిచేస్తున్నాడు, మన ద్వారా కూడా పనిచేస్తున్నాడు. ఇదే ఆత్మయందు సహవాసం. కొంతమంది విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ నా ద్వారా చాలా పనిజరగాలని అనుకొంటారు. నీ ద్వారా పనిజరగాలంటే ముందు నీలో పని జరగాలి. నీలో పనిచేయని దేవుడు నీద్వారా పనిచేయించుకోలేడు. ముందు నీలో పనిచేయనివ్వు. దేవా ముందు నాలో పనిచేయండి, నన్ను విరచు నాయనా, నీ పని కోసం నన్ను వంచు నాయనా అని ప్రార్థన చేయాలి. వేల్స్ పట్టణంలో ఉజ్జీవం కోసం ఇవాన్ రాబర్ట్స్ అనే యవ్వనస్తుడు 'దేవా నన్ను వంచు, నన్ను విరువు, నా సంఘాన్ని ఆశీర్వదించు' అని ప్రార్థన చేశాడు. వేల్స్‌లో ఉజ్జీవ జ్వాల రగిలింది. మనం కూడా ఇలా ప్రార్థన చేయకపోతే దేవుని కార్యాన్ని చూడలేము. ఆత్మయందు సహవాసం అంటే ఆయన మనలో జీవించడం, మనలో పనిచేయడం, మనద్వారా పనిచేయడం.

### డి. ఏ దయారసమైననూ, వాత్సల్యమైనను ఉన్నయెడల...

మత్తయి 9:36లో ఆయన కాపరిలేని గొర్రెలువలె ప్రజలు విసికి చెదరి ఉండగా ప్రభువు వారిని చూసి కనికరపడ్డాడు. కమ్ + ప్యాషన్ - కంప్యాషన్ అంటే ఎదుటివారు ఏ పరిస్థితిల్లో ఉన్నారో ఆ పరిస్థితుల్లోకి వెళ్ళడమే. ఎదుటివారు బాధపడితే బాధపడడం, ఎదుటివారు ఏడిస్తే ఏడ్వడం. యెషయా 63:8లో "వారి యావద్బాధలో ఆయన బాధనొందెను ఆయన సన్నిధి దూత వారిని రక్షించెను ప్రేమచేతను తాలిమిచేతను వారిని విమోచించెను పూర్వదినముల న్నిటను ఆయన వారిని ఎత్తికొనుచు మోసికొనుచు వచ్చెను".

ప్రియమైన తమ్ముడు, చెల్లి ఇంటికి వెళ్ళిన తర్వాత ఏమైనా బాధలు వస్తే నీ ఒక్కడివే బాధపడుతున్నావని అనుకోవద్దు. నీతో బాధపడే ప్రభువు ఉన్నాడు. ఆయన ఏడ్చేవారితో ఏడుస్తాడు (యోహాను 11:35). అందుకే ఆయన దగ్గర దయాసరం, వాత్సల్యం ఉంది. మనం ఐకమత్యంతో, ప్రేమతో ముందుకు సాగడానికి యేసునందు మనకు వాత్సల్యం, దయారసం ఉంది. క్రీస్తులో ఇవన్నీ కలిగి ఉన్న మనం ప్రేమతో ఐకమత్యంతో బతకకపోతే ఎవరు బతుకుతారు? గనుక ఆనందంతో సేవ చేయాలి, ఆనందంతో భక్తిచేయాలి. కృంగిపోవద్దు.

## 2. ప్రేమ, ఐక్యతను చల్లార్చేవి

"మీరు ఏకమనస్కులగునట్లుగా ఏకప్రేమకలిగి, యేక భావముగలవారుగా ఉండి, ఒక్కదానియందే మనస్సుంచుచు నా సంతోషమును సంపూర్ణము చేయుడి. కక్షచేతనైనను వృథాతిశయముచేతనైనను ఏమియు చేయక, వినయమైన మనస్సుగలవారై యొకనినొకడు తనకంటె యోగ్యుడని యెంచుచు మీలో ప్రతివాడును తన సొంతకార్యములను మాత్రమేగాక యితరుల కార్యములను కూడ చూడవలెను" (ఫిలిప్పీ 2:2-4). ఈ మూడు వచనాల్లో మూడు విషయాల్ని చూద్దాం.

### ఎ. వ్యక్తిగతమైన కక్షలు (3వ)

ఇవి ఎలా ఉంటాయంటే 'పార్టీలు కట్టే తత్వం, గ్రూపిజం ఉంటుంది'. నాకు ఫలాన అన్నంటే ఇష్టం. ఆయన నాయకత్వంలో మాత్రమే పనిచేస్తా. మిగిలి

నవారు నాయకత్వంలో ఉంటే నేను కనబడను, ఆయనొస్తే నేనుండను అని అంటారు. క్రైస్తవ సహవాసమనే ఈ మంచి కుటుంబంలో ఒక వ్యక్తిని బట్టి విబేధాలు తీసుకురావడం వల్ల కక్షలు వస్తున్నాయి. మనమంతా ఒకే కుటుంబం. కులం లేదు, క్వాలిఫికేషన్స్ లేవు, ఆర్థిక తారతమ్యాలు లేవు. దీనికి వేరుగా ఏది ఉన్నా అది దుష్టునినుండి వచ్చినదే. పరిశుద్ధాత్ముని వలన పుట్టినది కాదు. ఇవి లోపలికి వస్తే ఆనందంతో, భక్తితో సేవను చేయలేము.

### బి. వృథాతిశయము (3వ)

అంటే వ్యక్తిగత మహిమను వెదకడం. యోహాను 8:50లో నేను నా మహిమను వెదకడం లేదు అని ప్రభువు అంటాడు. స్వంత గుర్తింపు కోరుకోకూడదు, పొగడ్తలకు పడిపోకూడదు. మనల్ని ఎవరూ గుర్తించకపోతేనే, పొగడకపోతేనే మంచిది. ఎందుకంటే పరలోకంలో ప్రభువుదగ్గరనుండి రావాల్సిన మెప్పులు మనకు వస్తాయి.

ఏడబ్ల్యు టోజర్ అనే భక్తుడు ప్రతిరోజు ఒక ప్రార్థన చేసుకొనేవాడు. 'ప్రభువా నీ మందిరంలో అందరూ కాళ్ళు తుడుచుకొనే ఒక గోనెపట్టాలా వాడుకో' అని. మనం వ్యక్తిగత మహిమ కోసం ఆరాటపడితే మన ప్రేమ, ఐక్యతలు చల్లార్చుకొంటాము.

### సి. వ్యక్తిగత స్వార్థం (4వ)

ఈ లక్షణం కలిగినవారు నా కార్యాలు ముందు జరగాలి అని అనుకొంటారు. దీనికి భిన్నంగా మనము వ్యక్తిగత స్వార్థానికి, స్వయానికి చచ్చి ఇతరుల కార్యాలు చూడాలి.

సాల్వేషన్ ఆర్మీ 110 దేశాలలో విస్తరించి ఉంది. దేవుడు అంతగా దానిని ఆశీర్వదించడాడు. ఒకసారి సంఘ పెద్దలు పరిశుద్ధ కూడికలు ప్లాన్‌చేసి విలియం బూత్ దగ్గరికి వచ్చి 'వచ్చే సం॥కి మీరు ఆరోగ్యంగా ఉంటారో ఉండరో ఈ కూడికలకు రండి అని ఆయనను అడిగారు. ఆరోగ్య స్థితిని బట్టి వస్తాను అన్నాడు. ఒకవేళ రాలేకపోతే మెసేజ్ అయినా రాసివ్వండి మేము చదువుతాము అన్నారట. మీటింగ్ మొదలయ్యింది. విలియంగారు వస్తున్నారో లేదో తెలియదు మెసేజ్ కూడా పంపించలేదు అనుకొంటుండగా ఒక టెలిగ్రాం వచ్చింది. ఏంటా ఇది అని చూస్తే అందులో ఒకే ఒక పదం 'ఇతరులు' అని ఉందట. విషయం నాయకులకు అర్థమైంది. ఆ ఒక్క మాటతోనే ప్రజలు పశ్చాత్తాపపడ్డారట. ఇతరులు అనేది మాత్రము చూడాలి. నేను నాది అనే దానికి చావాలి. సంఘానికి వెలుపుల ఉన్నవారు సంఘం లోపలికి రావాలని మనం ఆరాటపడాలి. అందుకే మనం బతకాలి.

## 3. ప్రమాదాలను అధిగమించడం వలన వచ్చే ఫలితాలు

### 1. ఏకత్వం (ఫిలిప్పీ 2:2)

### ఎ. ఏకమనస్సు (ఫిలిప్పీ 2:2)

ఏకమనసు అంటే సంకల్పంలో ఐకమత్యం. మనందరి సంకల్పం ఏమైయుండాలంటే యెషయా 43:7; 1 కొరింథీ 10:31 ప్రకారం మన జీవితాలు, మన కుటుంబాలు, ఉద్యోగాలద్వారా దేవునికే మహిమ రావాలి. మనమంతా ఒకే కుటుంబంలాగా ఉండాలి.

### బి. ఏక ప్రేమ (ఫిలిప్పీ 2:2)

అందరిదీ ఒకేభారం ఉంటుంది. పరిశుద్ధులను ప్రేమిస్తాము. వారిలో క్రీస్తు సారూప్యం వచ్చేవరకు మనలో ప్రసవవేదన ఉంటుంది. కాన్ఫరెన్స్‌లో నా పక్కన కూర్చొన్న తమ్మునిలో, చెల్లిలో క్రీస్తు సారూప్యం రాకపోతే నాకు ప్రసవ వేదన ఉంటుంది. అలాగే పాపుల మీద కూడా ప్రేమ కలిగి ఉండాలి. విగ్రహాలను ఆరాధిస్తున్న ఏథెన్స్ పట్టణస్థులను చూసినప్పుడు పౌలు పరితపించిపోయాడు. మనం కూడా విగ్రహారాధికులను, పాపంలో ఉన్నవారిని చూసినప్పుడు వారిని విమర్శించకుండా ఏడ్చి వారి గూర్చి పరితాపం చెందాలి.

గ్లాస్కో సిటీ విలియం బాండ్స్‌ని వాళ్ళమ్మ షాపింగ్‌కి తీసుకెళ్ళింది. లోపలికిరా బాబు అనగానే నేను బయట ఉంటాను రాలేను అన్నాడు. జనమంతా ఓ చోట గుమిగూడి ఉన్నారు. ఏంటా అని చూస్తే తన కొడుకు నేల వరకు వంగి ఏడుస్తున్నాడు. ఎందుకేడుస్తున్నావ్ అంటే గ్లాస్కో సిటీలో ఇంతమంది నశించి నరకానికి



పోతుంటే నవ్వుతూ ఎలా నిలబడమంటావు మమ్మీ, నాకేడుపొస్తుంది అన్నాడు. నరకానికి వెళ్ళేవారి ని చూసినప్పుడు మనకు ఏడుపురావడం లేదు. మన కళ్ళల్లో నీళ్ళు ఎండిపోయాయి, కళ్ళల్లో నీళ్ళు రావడం లేదు. ఇవిలేని నాడు మనం ఏక ప్రేమలోకి రానట్లే. పరిశుద్ధుల కొరకైన ప్రసవవేదన, పాపుల కొరకైన పరితపించే మనస్సు  ఈ రెండూ మనలో కలగకపోతే ఈ కాన్ఫరెన్స్ వృధానే.

### సి. ఏకభావం (ఫిలిప్పీ 2:2)

ఏకభావం గలవారు ఏకశక్తి కలిగినవారు. స్పర్టా అనే చిన్న దేశ రాజును శత్రురాజు 'ఏమయ్యా మీది చిన్నది, అందమైన సంపన్న దేశం. దీని చుట్టూ ఒక్క ప్రాకారం కూడా కట్టలేదు' అని అన్నప్పుడు ఆ రాజు 'ప్రాకారం లేదని ఎవరు చెప్పారు? మా దేశానికి ప్రాకారం ఉంది. నా ప్రజలే నా దేశానికి ప్రాకారం. మా మధ్య ఉన్న ప్రేమ, ఐక్యత మాదేశాన్ని కాపాడుతున్నాయి. యుఇయస్ఐ అనే చిన్న దేశాన్ని కాపాడుకోవడానికి ఏకభావం రాకపోతే  కష్టమే. దీనిలో ప్రేమ, పరిశుద్ధత, రోషం, సౌవార్తీకరణ, శిష్యత్వం చేసే ప్రక్రియ, సాహిత్యం, కుటుంబాల పట్ల పరిచర్య ఇలాంటి అందమైన దేశాన్ని కాపాడుకోవడానికి ఏకభావంలోకి వస్తే ఇవే యుఇయస్ఐకి ప్రాకారం. పరిశద్ధుల కొరకైన ప్రసవ వేదన, పాపులకై పరితపించే వేదన రావాలి. యుఇయస్ఐ ప్రోగ్రామ్‌లో నశించిన విద్యార్థి రక్షణపొందాలి, రక్షణ పొందినవాడు శిష్యుడు, నాయకుడవ్వాలి. నాయకుడైన విద్యార్థి సంఘానికి, సమాజానికి ప్రయోజకుడు కావాలి. ఇదే మన ప్రోగ్రామ్. ఈ పనిలో మనకు ఏకత్వం వస్తే దేవునికి స్తోత్రం.

### 2. వినయ మనస్సు (ఫిలిప్పీ2:3)

పౌలు మూడవ సువార్త ప్రయాణంలో ఉన్నప్పుడు కొరింథీయులకు పత్రిక రాస్తూ "నేను అపొస్తలు లందరిలో తక్కువ వాడను" (1 కొరింథీ 15:9) అంటాడు. తర్వాత రోమా చెరసాలలో ఉండి ఎఫెసీయులకు పత్రికను రాస్తూ 'పరిశుద్ధులందరిలో నేనుఅత్యల్పుడను' అన్నాడు. ఆయన మరణించే ముందు తిమోతికి రాస్తూ 'నేను పాపులలో ప్రధానుడను' అని చెబుతున్నాడు. వినయం అనేదానికి సరైన అర్థం ఏంటంటే 'గర్వించడానికి




ఎన్ని కారణాలున్నా అక్కడే తగ్గించుకోగలిగితే నీకు వినయభావం వచ్చినట్లు'. ఈ వినయ భావం మనలో వస్తే భక్తిని, సేవను ఆనందంగా చేస్తాం. ప్రేమ ఐక్యతలో సాగిపోతాం.

### 3. సహాయపడే జీవితం (ఫిలిప్పీ 2:4)

ఇతరుల కార్యాలు చూడాలి. చైనాలో కొంతకాలం మిషనరీగా పనిచేసిన వాచ్‌మన్ నీ ఒక ఉదాహరణ చెప్పాడు

విశ్వాసియైన ఒక రైతుకి కొండపైన కొంచెం భూమి ఉంది. దానిలో వరిపంట వేసి ప్రతిరోజు ఉదయాన్నే ఆ పొలానికి నీరు పెట్టి కొండ దిగుతాడు. తన ఇంటి పక్కన దేవుని నమ్మని మరొక పేదరైతు ఉన్నాడు. ఆయనకు దిగువన భూమి ఉంది. విశ్వాసియైన రైతు రోజు నీళ్ళుపెట్టి దిగి వచ్చిన తర్వాత ఈ అవిశ్వాసియైన రైతు విశ్వాసి పొలంలోని గట్లు తెంపి నీళ్ళను దిగువున ఉన్న తన పొలానికి మళ్ళించుకొనేవాడు. విశ్వాసియైన రైతుకు చాలాబాధనిపించింది. దేవా, నేనేమి చేయాలని ప్రార్థిస్తే దేవుడు అతని పొలాన్ని ముందు పట్టించుకో అన్నాడట. తన పొలంలో నీళ్ళుపెట్టడం మానేసి ఆయన పొలంలో నీళ్ళు పెట్టడం ప్రారంభించాడు. తన పొలంలో నీళ్ళు ఉండడం చూసి అవిశ్వాసియైన రైతు అడిగితే నీకు శక్తి స్తోమత లేదని నేనే పెట్టాను అని చెప్పాడట. అప్పుడు అవిశ్వాసియైన రైతు దండం పెట్టి 'అయ్యా ఈ మనస్సు ఎవరిచ్చారయ్యా నీకు' అని అడిగాడట. దేవుడు నాకు ఈ మనసిచ్చాడని చెప్పినప్పుడు ఆ దేవుడు నాకు కావాలని అడిగాడట. విలియం బూత్ చెప్పినట్లు 'ప్రభువా ఇతరులే ప్రభువా ఇతరులే' ఇదే మన జీవిత మాట. ఇతరుల కొరకు ఆలోచించేటట్లు, ఇతరుల కొరకు జీవించేటట్లు సహాయం చేయండి అని ప్రార్థన చేద్దాం. అప్పుడు మనం సహాయపడే జీవితానికి వస్తాం.

**– పి.ఏ.స్వామి,** శ్రీకాకుళం
వెస్ట్‌రాయలసీమ స్టైకాన్ ఫైనల్ డివోషన్
**కూర్పు: మార్త కొండలరావు, బొల్లాపల్లి**



# వారసత్వాన్ని అందించు

మనరోజులు లెక్కించబడి ఉన్నాయి. మన జీవితంలో మనకుండాల్సిన ప్రాథమిక లక్ష్య మేంటంటే మన చివరి రోజుకోసం సిద్ధపడడమే. ఈ క్రమంలో మన తర్వాత తరానికి మనం వదిలిపెట్టాల్సింది ఆస్థి మాత్రమే కాదు. నాణ్యమైన జీవితాన్ని కూడా. మంచి వారసత్వాన్ని మనం వదిలి వెళితే అది ప్రజల ద్వారా జీవిస్తూనే ఉంటుంది.

## వారసత్వం అందించడం

లెగసీ అనగా వారసత్వం. పూర్వీకుల దగ్గర నుండి తర్వాత తరాలకు అందించే స్వాస్థ్యం అని అర్థం. ఈ లోక సంబంధమైన ఆస్తిపాస్తులు, సంపద, ధనం ఒక వారసత్వంగా వారి సంతానానికి అందిస్తారు. అయితే దేవుని బిడ్డలుగా మనం ఇహలోక సంబంధమైన వారసత్వాన్ని మాత్రమే అందిస్తే సరిపోదు. మనం ఆధ్యాత్మిక సంపదను, మనం జీవిత విలువల ను తర్వాత తరానికి అందించడం ప్రాముఖ్యం. యుఇయస్ఐ సహవాసంలో మన పూర్వీకులు ఆధ్యాత్మిక విలువలతో కూడిన జీవితం జీవించి, తరువాత తరాలకు మౌళిక విలువలను వారసత్వంగా అందించారు. వారి జీవితాలు మనకు ఎంతో ఆదర్శవంతంగా ఉండి, మన జీవితాలను ఎంతో ప్రభావితం చేశాయి. వారి ప్రార్థనా జీవితం, తగ్గింపు స్వభావం, ఆత్మలపట్ల భారం, విశ్వాస జీవితం, త్యాగం, ప్రేమ, నిస్వార్థ జీవితం, సామాన్య జీవిత విధానం, కష్టించి పనిచేసే తత్వం ఇలా ఎన్నెన్నో మనం జ్ఞప్తికి తెచ్చుకొన్నప్పుడు వారు విడిచి వెళ్ళిన వారసత్వం మన జీవితాలను ఎంతగానో ప్రభావితం చేసింది/చేస్తుందని చెప్పక తప్పదు. వారు మనకు మాదిరిగా ఉన్నారు.

## భక్తుల మాదిరి

పరిశుద్ధ గ్రంథంలో, చరిత్రలో అనేకమంది భక్తులు వారి జీవితాలలో దేవుని సంకల్పాలను నెరవేర్చుతూ తర్వాత తరానికి అనేక విలువల్ని వారసత్వంగా వదిలివెళ్ళారు.

### విశ్వాసులకు తండ్రియైన అబ్రహాము

దేవుడు అబ్రహామును పిలిచినప్పుడు పూర్ణ విధేయతతో దేవుడు చూపించే స్థలానికి బయలు దేరి వెళ్ళాడు. దేవుని మీద అచంచలమైన విశ్వాసం కలిగి ప్రతి పరిస్థితిలో ముందుకే సాగాడు. ఎన్నో క్లిష్ట సమస్యలు ఎదురైనా దేవునిని వెంబడించి విశ్వాసులకు తండ్రి, దేవునికి స్నేహితుడని పిలవ బడ్డాడు. అబ్రహాము విధేయత తరతరాలకు ఆశీర్వాద కారణమైంది.

### దైవజనుడైన మోషే

మోషే దేవుని పనిని నమ్మకంగా జరిగించి, ఒక మంచి వారసత్వాన్ని వదిలిపెట్టాడు. దేవుని



**మన పెద్దలు ఎంతో త్యాగపూర్వకంగా పరిచర్య జరిగించి, అట్టి బాధ్యత తర్వాత తరానికి ఒక వారసత్వంగా విడిచి వెళ్ళారు. ఈ పరిచర్య చాలా అమూల్యమైనది. వ్యక్తిగత గుర్తింపు లేకపోయినా ప్రత్యేక ధన్యవాదాలు ఎవరూ తెలుపకపోయినా, ప్రైవసీని, సౌఖ్యాలను కోల్పోతున్నప్పటికీ, దేవుడు ఇచ్చిన దర్శనానికి అవిధేయులు కాక సువార్త సేవ కొరకు వారి జీవితాలను వెచ్చించిన మన పూర్వీకులు అనేకులు ఉన్నారు.**

ఇల్లంతటిలో నమ్మకమైనవానిగా, సాత్వికునిగా సాక్ష్యం పొందాడు. తనకు అప్పగింపబడిన మందను బహు జాగ్రత్తగా, బాధ్యతతో నడిపించాడు. దేవునితో అతి సన్నిహితంగా జీవించి, ఆయన సన్నిధిని అనుభవించాడు.

### నాయకుడైన యెహోషువ

మోషే తర్వాత యెహోషువా ఆ వారసత్వాన్ని అందుకొన్నాడు. అతను కూడా దేవునియందు భయభక్తులు కలిగి, ఆయన పనిని నమ్మకంగా జరిగించాడు. ఇశ్రాయేలు ప్రజలను ఆ వారసత్వాన్ని అందుకోవాలని, దానిని కొనసాగించాలని హెచ్చరించాడు. యెహోషువా 24వ అధ్యాయంలో దేవుని గొప్పపని పూర్తి చేయబడింది. రాజ్యాలను ఓడించి స్వాధీనపరచుకొని ఇశ్రాయేలీయుల గోత్రాలకు విభాగించాడు. "నేనును నా కుటుంబము యెహోవాను సేవిస్తాము' అనే ఎంపిక కలిగి ఉండి ఇశ్రాయేలీయులను ఒక ఎంపిక చేసుకోండి అని హెచ్చరించి తన జీవితంలో ప్రాధాన్యత వారికి తెలిపాడు.

### రాజైన దావీదు

1 దిన 28,29 అధ్యాయాలలో దావీదు దేవుని కొరకు తను ఎలా జీవించాడో, దేవుడు ఎంత గొప్పవాడో, ఆయన కొరకు తన కుమారుడైన సొలోమోను, అప్పటి ప్రజలు ఎలా జీవించాలో తెలియజేశాడు. తన వారసత్వాన్ని కొనసాగించాలని సొలోమోనును హెచ్చరించాడు. దావీదును గురించి అపో. 13:36లో దావీదు దేవుని సంకల్పం చొప్పున తన తరం వారికి సేవ చేసెనని రాయబడింది. దావీదు మంచి సాక్ష్యం పొందియున్నాడు. అతడు నా యిష్టానుసారమైన మనుష్యుడు, అతడు నా ఉద్దేశములు నెరవేర్చునని దేవునినుండి సాక్ష్యం పొందగలిగాడు. మరియు అతడు యదార్థ హృదయుడై వారిని పాలించెను, కార్యములయందు నేర్పరియై వారిని నడిపించెను (కీర్తన 78:72). దావీదు ఇట్టి జీవితం జీవించి ఒక గొప్ప దైవిక వారసత్వాన్ని విడిచి వెళ్ళాడు.

### అపొస్తలుడైన పౌలు

పౌలు భక్తుడు–"నేను క్రీస్తును పోలి నడుచుకొనుచున్న ప్రకారం మీరు నన్ను పోలి నడుచుకొనుడి" (1 కొరింథీ 11:1) అనే సవాలుతో కూడిన సందేశాన్ని మనముందుచాడు. భౌతిక సంబంధమైన సాధకం, సంపదలకు కొంచెం ప్రయోజనమే కలుగుతుందని, ఆత్మ సంబంధమైన సంపద ఇప్పటి జీవంలోనూ, రాబోవు జీవంలోను ప్రయోజనకరంగా ఉంటుందని తిమోతికి తెలియజేశాడు (1తిమో 4:8).

### డేవిడ్ లివింగ్‌స్టన్

డేవిడ్ లివింగ్‌స్టన్ అనే మిషనరీ ఆఫ్రికా ఖండంలో చనిపోయినప్పుడు తన మృతదేహాన్ని తన స్వంత పట్టణానికి తీసుకొచ్చారు. అక్కడ ఒక వ్యక్తి వెక్కి వెక్కి ఏడ్వడం ఒకాయన గమనించి కారణం అడిగితే, అతడు తన క్లాస్‌మేట్ అని చెప్పాడు. డేవిడ్ లివింగ్‌స్టన్ ఆఫ్రికాకు మిషనరీగా వెళుతున్నప్పుడు మేమంతా అపహాస్యంచేశాం. కానీ తన జీవితంలోని ప్రాధాన్యతలు సరైన స్థానంలో ఉంచుకొన్నాడు. అతడు ఒక ఉద్దేశం కోసం బతికాడు, ఒక ఉద్దేశం కోసం చనిపోయాడు. నేను ఎందుకు బతుకుతున్నానో, ఎందుకు చావబోతున్నానో కూడా నాకు తెలియదు అని చెప్పాడు. డేవిడ్ లివింగ్టన్ ఒక ప్రాధాన్యత కొరకు జీవించి వారసత్వాన్ని వదిలి వెళ్ళాడు. చీకటి ఖండమైన ఆఫ్రికాను దేవుని సువార్తతో వెలిగించాడు.

### యుఇయస్ఐ పితరుల మాదిరి

ప్రొఫెసర్ ఇనాక్. డా. స్టెరెట్, జాన్‌మూడి,

దేవిడ్ సిసి వాట్సన్, పిటి చాందపిళ్ళ, పిసి వర్గీస్, సత్కీర్తిరావు, జోసఫ్ అభిషేకరావు, ప్రొ.దేవపాల్, దీనబంధు, జెయస్‌పి జూలియస్, డా. సరళా ఎలీషా, అగస్టీన్, ఆలివ్ రోజర్స్...మొదలగు వారంతా గొప్ప సమర్పణతో దేవునికొరకు జీవించి గొప్పవారత్వాన్ని, విలువలను మనకు వదిలివెళ్ళారు. వాటిలో కొన్నిటిని చూద్దాం.

## వాక్యపు వెలుగులో నడిచారు, నమ్మకంగా పరిచర్య చేశారు

యుఇయస్‌ఐలో ఉన్న విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ స్టాఫ్ దేవుని వాక్యముతో వారి జీవితాలను కట్టుకోవడం, దేవుని చిత్తాన్ని తెలుసుకోవడం, వాక్యాన్ని కేంద్రంగా ఉంచుకోవడం ఒక ధన్యతగా భావించారు. మన పితరులు దేవుని వాక్యానికి చాలాప్రాధాన్యత నిచ్చారు. వాక్య ప్రకారం నడుచుకొన్నారు, వారసత్వంగా అందించారు. మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులుగా చేయుడి అనే దేవుని ఆజ్ఞను అనుసరించి కళాశాల విద్యార్థులకు సువార్తను అందించడం ద్వారా వారిని ప్రభువులోకి నడిపించి, వారిని ప్రభువు శిష్యులనుగా సిద్ధపరచి, క్రైస్తవ సంఘానికి, సమాజానికి ప్రయోజకులుగా చేసే దర్శనాన్ని దేవుడు యుఇయస్‌ఐకి ఇచ్చాడు. మన పెద్దలు ఎంతో త్యాగపూర్వకంగా పరిచర్య జరిగించి, అట్టి బాధ్యత తర్వాత తరానికి ఒక వారసత్వంగా విడిచి వెళ్ళారు. ఈ పరిచర్య చాలా అమూల్యమైనది. వ్యక్తిగత గుర్తింపు లేకపోయినా ప్రత్యేక ధన్యవాదాలు ఎవరూ తెలుపకపోయినా, ప్రైవసీని, సౌఖ్యాలను కోల్పోతున్నప్పటికీ, దేవుడు ఇచ్చిన దర్శనానికి అవిధేయులు కాక సువార్త సేవ కొరకు వారి జీవితాలను వెచ్చించిన మన పూర్వీకులు అనేకులు ఉన్నారు.

ఎప్పుడూ ఆత్మల భారంతో ఉండే పి.సి. వర్గీస్ గారు, గొప్ప ఎక్స్పోజిటరీ ప్రీచర్‌గా వాడబడిన సత్ కీర్తిరావు గారు - ఇద్దరు దేశంలో నలుమూలల తిరిగి సువార్త సేవ జరిగించారు. జోసఫ్ అభిషేకరరావుగారు ఒక మండే దీపంలాగ వాడబడ్డారు. క్రిష్ణయ్య–లూయిస్ కుటుంబం కష్టపడి పనిచేసే మనస్తత్వంతో రాయలసీమను రత్నాల సీమగా తీర్చిదిద్దారు. వీరంతా ఆసక్తితో పనిచేసి గొప్ప వారసత్వాన్ని వదిలి పెట్టారు.

## విశ్వాస జీవితం

యుఇయస్‌ఐ కుటుంబం, వ్యక్తిగత జీవితాల్లోనూ పరిచర్యలోనూ అవసరాల కొరకు దేవుని వైపు చూడడం మన పూర్వీకుల జీవితాల్లో చూడగలం. యుఇయస్‌ఐ ఆర్థిక విధానం, ఆదినుండి వారు అనుసరించిన విధానం, విశ్వాసంతో దేవునిపై ఆధారపడడమే. చిన్న రిట్రీట్ మొదలుకొని, జాతీయ సదస్సుల వరకు విశ్వాసంతో ప్రారంభించి ప్రతీ కార్యములో ఇప్పటి వరకు దేవుడు సహాయం చేస్తూ తన విశ్వాస్యతను కనుపరుస్తున్నాడు. సి.ఎస్.దత్ గారు స్టాఫ్‌గా ఉండే కాలంలో రాష్ట్ర ఆర్థిక వనరులు చాలా తక్కువగా ఉండేవి. అయినా ఆయన ఒక విశ్వాసవీరునివలే సేవ చేశారు. సంతృప్తికరమైన దైవభక్తి గొప్పలాభసాధనము అనే దేవుని వాక్యం తన జీవితంలో చూడగలిగే వాళ్ళం. తాను పనిచేసిన కాలం చాలా తక్కువే అయినా విశ్వాసజీవితం అనే వారసత్వాన్ని విడిచి పెట్టాడు.

## ఓపెన్ హోమ్స్

యుఇయస్‌ఐ పరిచర్య ప్రొఫెసర్ ఇనాక్ దంపతుల కుటుంబంలో చిన్నగా ప్రారంభించబడింది. వారు ఈ సేవ కొరకు తమ జీవితాన్ని సమర్పించుకొన్నారు. తద్వారా అనేక కుటుంబాలు దేవుని పరిచర్యకు తెరవబడి విద్యార్థులకు ఆధ్యాత్మిక కేంద్రాలుగా ఏర్పడ్డాయి. దేవుని వాక్యాన్ని కలిసి చదవడం, ప్రార్థించడం, ఒకరి అనుభవాలను ఒకరు పంచుకోవడం ద్వారా వారి జీవితాలను క్రీస్తు ప్రభువులో కట్టుకోవడానికి దోహదపడ్డాయి. వారి ఆధ్యాత్మిక అవసరతలు మాత్రమేకాక, వారి భౌతిక అవసరతలను గురించిన ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉండేవారు. జెయస్‌పి జూలియస్–రేణుక గార్ల కుటుంబం విశాఖపట్నంలో ఒక తెరువబడిన కుటుంబం. ఇక్కడ చదువుకొన్న విద్యార్థులు, యవ్వన గ్రాడ్యుయేట్స్ చాలామంది ఈ కుటుంబ మాదిరికి ప్రభావితులై ఇలాంటి క్రైస్తవ కుటుంబం నిర్మించుకోవాలనే తీర్మానములతో బయటికి వెళ్ళారు. ఈ సందర్భంలో ప్రొ. దేవపాల్‌గారి కుటుంబాన్ని, జయనేంద్రగారి కుటుంబాన్ని జ్ఞాపకం చేసికోవచ్చు. ఇలాంటి కొన్ని కుటుంబాలు వదిలిన వారసత్వాన్ని బట్టి ఈ రోజు మన రాష్ట్రంలో చాలా కుటుంబాలు కట్టబడుతూ పరిచర్యకు దోహదపడుతున్నాయి.

యేసు ప్రభువును నమ్మిన విశ్వాసి తన కుటుంబంలో ఆత్మీయ లెగసీని విడిచిపెట్టాల్సిన

బాధ్యత ఉంది. పిల్లలు తమ తల్లిదండ్రులను గుర్తు తెచ్చుకొన్నప్పుడు వారి ప్రార్థనా జీవితం, యధార్థత, దేవునిని ప్రేమించిన విధానం, వారి తగ్గింపు జీవితం, పరిచర్య పట్ల ఆసక్తి, దేవునియందలి భయం, నిస్వార్థ జీవితం, త్యాగం, వీటితోపాటు తల్లిదండ్రులు ఒకరి ని ఒకరు ప్రేమించుకొనే విధానం, ఇవన్నీ తరువాత తరాలకు గొప్ప వారసత్వాన్ని అందజేయగలు గుతాయి. వారి జీవితంలో కొన్ని అడుగులు విశ్వాసంతో ధైర్యంగా వేయగలుగుతారు.

## సేవక నాయకత్వం

డా. స్టైరట్ దంపతులు తమ సర్వస్వాన్ని దేవుని పనికి అర్పించి సేవక నాయకులుగా జీవించారు. చాందపిళ్ళ గారు ఎన్నో ఉద్యోగ అవకాశాలున్నప్పటికి వాటిని విడిచి తక్కువ శాలరీతో దేవునిసేవ చేయడానికి స్టాఫ్‌గా చేరారు. ఆదినుండి యుఇయస్‌ఐ పరిచర్యలో ఉన్న నాయకులు సేవక నాయకత్వ లక్షణాలు కలిగి ఉన్నారు. వారు బాధ్యత గల నాయకులుగా పనిచేసి ఇతర నాయకులను సిద్ధం చేశారు, వారిని ప్రోత్సహించారు. బ్ర. దీనబంధు ఒరిస్సాలో ఇయు పరిచర్యను ప్రారంభించారు. తిరిగి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి ఏపి-ఇఐయఫ్‌ను ఆరంభించిన వారిలో ఒకరిగా ఉన్నారు. పేరుకు తగ్గట్టే దీనమనసు కలిగి ఉండేవారు. వారు విద్యార్థి నాయకత్వాన్ని ప్రోత్సహించేవారు. హెూలిస్టిక్ అప్రోచ్ పరిచర్యలో పాల్గొని యేసు క్రీస్తు ప్రేమను క్రియారూపకంగా అందించి, ఒక మంచి వారసత్వాన్ని వదిలి వెళ్ళారు.

## ముగింపు

అపొస్తలుల కార్యాల గ్రంధంలో ఉన్న తబిత తాను జీవించినప్పుడు చేసిన సత్క్రియలు, ధర్మకార్యాలు, ఆధ్యాత్మిక సంపదగా విడిచి పెట్టింది. ఆమె చనిపోయినప్పుడు విధవరాండ్రు ఆమె కుట్టిన అంగీలు, వస్త్రములు చూపి ఆమె సత్క్రియల ను జ్ఞాపకం చేసుకొన్నారు. మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి (మత్తయి 5:16) సత్క్రియలు అనే వారసత్వాన్ని మనము కలిగి ఉండాలి.

ఇప్పటి వరకు మన పితరులు ఒక మంచి జీవితం జీవించి, మంచి పరిచర్యను జరిగించి మనకు ఒక మంచి వారసత్వాన్ని విడిచి వెళ్ళారు. ఆ సంపదను అందిపుచ్చుకొని మనం కూడా అట్టి జీవితం జీవించి, ప్రభావవంతమైన పరిచర్య జరిగించి, రాబోయే తరానికి మనం కూడా మంచి వారసత్వం అందిద్దాం.

ఇంత గొప్ప సాక్షి సమూహము మేఘము వలె మనలను ఆవరించి యున్నందున మనము కూడా ప్రతి భారమును సులువుగా చిక్కులు పెట్టు పాపమును విడిచిపెట్టి విశ్వాసమునకు కర్తయు, దాని కొనసాగించు వాడునైన యేసువైపు చూచుచు మన యెదుట ఉంచబడిన పందెంలో ఓపికతో పరిగెత్తుదము. (హెబ్రీ 12:1,2).

**- కె.యోహాను, తుని**

నార్తరన్ సర్కార్స్ స్టైకాన్ ప్లీనరీ

## నేర్చుకొన్న పాఠాలు

ఆత్మీయ సహవాసంలో ఆత్మీయమైన మాటలు
ఆనందకరమైన పలకరింపులు
వాక్యార్థముతో కూడిన పాటలు నన్ను
మేల్కొలిపాయి

ఫ్యామిలీగా ఒకరినొకరు ప్రేమతో భరించుకోవడం,
సహించుకోడం, కలిసి దేవుని పరిచర్యలో
ముందుకు నడవడం అనేవి ఎక్స్‌పోజిషన్స్ ద్వారా
నేర్చుకొన్నాను

సులువుగా చిక్కులు పెట్టే గర్వం, కోపం,
క్షమించలేని మనసు, నాకే తెలుసనే భావన,
మొదలగు పాపపు నట్లన్నీ డివోషన్స్‌లో ఊడి
పడ్డాయి.

స్పిరిచువల్ లీకేజ్ జరిగినట్లు ఆనవాలు గుర్తించేలా
చేశాయి. దేవునితో లింక్ లేకపోతే లీకేజ్ తప్పదని
రుజువు చేశాయి.

క్షమించబడిన నీవు ఇతరులను క్షమించాలని,
ప్రేమించాలని, అదే ఐక్యతకు ప్రామాణికమని,
పిలిచిన పిలుపుకు, ఏర్పాటుకు కొలమానమని
గ్రహించాను.

కుటుంబ జీవితంలో దేవుని సార్వభౌమాధికారాన్ని
ఒప్పుకొంటూ, ఇతరులు నా యెడల చేసిన తప్పుని
క్షమించుకొంటూ, ప్రతి పరిస్థితిని ఓర్చుకొంటూ
వాక్యంతో నా జీవితాన్ని కట్టుకుంటూ,
పరిచర్యలో ప్రయాస వ్యర్థంకాదనే ప్రోత్సాహంతో
ముందుకు సాగిపోతున్నాను

**- కె. సతీష్,** తాడేపల్లి




# డిజిటల్ వ్యసనం

డిజిటల్ వ్యసనం అంటే డిజిటల్ మీడియాపైన, డిజిటల్ వస్తువులైన స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్స్, ఇంటర్నెట్, టివి, వీడియో గేమ్స్ పైన ప్రమాదకరమైన రీతిలో మితిమీరి ఆధారపడటం. డెలాయిట్ వారు 2015లో చేసిన రీసెర్చ్ ప్రకారం, 40% మంది ఉదయం లేచిన దగ్గరనుండి ప్రతి 5 నిమిషాలకు ఒకసారి తమ ఫోన్‌లను చెక్ చేసుకొంటారు. 50% మంది రోజుకు కనీసం 25 సార్లు చూసుకొంటారు. దీనిని బట్టి మన సమాజం ఇంతకుముందు లేనివిధంగా డిజిటల్ వస్తువులకు ఎంతగా కనెక్ట్ అవుతున్నారో, సాంకేతిక పరికరాల మీద ఆధారపడుతున్నారో అర్థమవుతుంది. అదే సమయంలో వ్యక్తిగతంగా, సమూహంగా మన సృష్టికర్త, రక్షకుడైన దేవునితో వ్యక్తిగత సంబంధము, సహవాసం ఎంత బలహీనముగా మారాయో అర్థమౌతుంది (రోమా 3:10-12). మనము ఈ పరిస్థితులను ఎలా అధిగమించగలమో దేవుని వాక్యంనుండి, ఆచరణాత్మకమైన దృష్టిలోనుండి అన్వేషిద్దాం.

### డిజిటల్ తరం అంటే ఏమిటి?

డిజిటల్ తరం (జెన్‌జెడ్) అంటే 1997 నుండి 2015 సంగల మధ్య పుట్టినవారు. (1981 నుండి 1996 మధ్యలో పుట్టిన వారిని మిలీనియల్ తరం అంటారు). డిజిటల్ తరం వారు అనేక సాంకేతిక పరికరాల మీద ఒకేసారి పనిచేస్తారు, డిజిటల్ ప్రపంచపు చెడు ప్రభావాలపై తక్కువ శ్రద్ధను కనపరుస్తూ ఉంటారు. ఉదా: 42% జెన్‌జెడ్ వారు చెప్పే విషయం ఏంటంటే తమ గురించి, తమకున్న ఆలోచనలకు ఒక రూపం ఇచ్చేది దేవుని వాక్యం కాదు, సోషల్ మీడియానే. ఇలాంటి వారు ప్రపంచ జనాభాలో దాదాపు 2.5 బిలియన్స్ ఉన్నారు. 68% మంది ఏదైనా వస్తువు కొనడానికి ముందు కనీసం 3 సార్లు రివ్యూలు చదువుతున్నారు. డిజిటల్ తరం కాని గత దశాబ్దాపు తరం వారు కూడ ఇందులో కన్పిస్తారు. అంటే మనలో ప్రతి ఒక్కరు విశ్వాసి అయినా అవిశ్వాసి అయినా రక్షణ పొందినా పొందకపోయినా, డిజిటల్ సాంకేతికతను వినియోగించడం మితిమీరి వ్యసనంగా మారుతుంది.

### ప్రస్తుతపు సోషల్ మీడియా - పోకడలు

ప్రజలు సోషల్ నెట్‌వర్క్ ద్వారా కనెక్ట్ అయ్యి, తమ ఫోటోలను, వీడియోలను పంచుకోవడానికి సోషల్ మీడియా సాంప్రదాయ వేదికగా ఉండేది. ఇప్పుడు ఆ రోజులు పోయి, చాలామంది తమ రోజులలోని మంచి సమయాలను సోషల్ మీడియాతో గడుపుతున్నారనడంలో అతిశయోక్తి లేదు. సోషల్

మీడియా అనేది దైనందిన వ్యక్తిగత జీవితంలో అంతర్భాగం అయ్యింది. ఉదయం లేవగానే ఫోన్‌ను చూడడం, సోషల్ మీడియాతో గడపడం మొదటి పని అనేంత వ్యవసనంగా మారింది. 2022 లెక్కల ప్రకారం ప్రఖ్యాతిగాంచిన సోషల్ నెట్‌వర్క్‌లు ఫేస్‌బుక్, యూట్యూబ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్, వుయ్‌చాట్, స్నాప్‌చాట్... మొదలైనవి.

ఫేస్‌బుక్‌కి 2.6 బిలియన్స్ వినియోగదారులు ఉన్నారు. వీడియోల కోసం యూట్యూబ్ ప్రాముఖ్యత పొందింది. సమాచారం పంపించుకోవడానికి వాట్సాప్ 3వ స్థానం, ఫేస్‌బుక్ మేసేజ్‌లు 4వ స్థానంలో ప్రఖ్యాతి గాంచినవి. యువత ఎక్కువగా ఇష్టపడుతున్న యాప్ ఇన్‌స్టాగ్రామ్. అలాగే టిక్‌టాక్‌ను కూడా 800 మిలియన్‌లు డౌన్‌లోడ్ చేసుకొన్నారు. ఈ మధ్యకాలంలో సందేశాలు పంపించడానికి ప్రపంచవ్యాప్తంగా వాట్సప్ ఉపయోగించేవారి సంఖ్య పెరుగుతూ ఉంది.

## వ్యక్తిగత జీవితం మీద సోషల్ మీడియా హానికరమైన ప్రభావం

ఎ. మన ఆలోచనల్లో మార్పు, మరెక్కువగా లోకం వైపు మళ్ళడం

బి. మన దృక్పథాలు, పనులు, నడకలలో కన్పిస్తున్న మార్పు

సి. మన విలువలు, దేవుని వాక్య విలువలనుండి దూరమవ్వడం

డి. మన స్నేహాలలో, సహవాసాలలో కన్పిస్తున్న మార్పు

ఇ. మన ఆసక్తి, ప్రాధాన్యతలు దేవుని వాక్యం నుండి, బైబిల్ స్టడీస్ నుండి, ప్రార్థనలనుండి తొలగిపోవుటలో కన్పిస్తున్న మార్పు

## డిజిటల్ వ్యసనం అంటే ఏమిటి?

డిజిటల్ వ్యసనం అనేది డిజిటల్ మీడియాపైన, డిజిటల్ వస్తువులపైన ప్రమాదకరమైన రీతిలో మితిమీరి ఆధారపడడం. దీనినే ఇంటర్నెట్ ఎడిక్షన్ డిజార్డర్ అని కూడా అంటారు.

### ప్రాథమిక పదాలు:

**గాడ్జెట్స్:** కంప్యూటర్, స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్, ట్యాబ్‌లు, ఐప్యాడ్‌లు, కేబుల్ టివి, ఇంటర్నెట్, టివి తదితరమైనవి.



**సాంకేతికత:** ఇంటర్నెట్ సర్వీస్, డిజిటల్ స్ట్రీమింగ్ సర్వీస్, హోం థియేటర్‌లు.. తదితరమైనవి.

**యాప్‌లు:** ఫేస్‌బుక్, యూట్యూబ్, వాట్సాప్, టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్, వీడియో గేమ్స్.

**ఓటిటి:** నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్, డిస్నీ, హెచ్‌బిఓ సినిమాలు మరియు వెబ్‌సిరీస్‌ల కొరకు.

**కంటెంట్:** టివి సీరియల్స్, రియాల్టీ షోలు, డ్యాన్స్ షోలు, కామెడి షోలు (ఉదా: జబర్దస్త్)

**సినిమాలు:** తెలుగు, హిందీ, ఇంగ్లీష్ సినిమాలు, సినిమా పాటలు, సినిమా క్లిప్‌లు, సినిమా సమీక్షలు, సినిమా డైలాగ్‌లు.

డిజిటల్ వ్యసనం అంటే పైన పేర్కొన్న వాటిలో ఏదో ఒక రూపంలో డిజిటల్ మీడియాను మితిమీరి, ప్రమాదకరమైన రీతిలో వాడుకోవడం.

తద్వారా మనతో మనకు, మనకు మన కుటుంబానికి, మనతో మన స్నేహితులకు, మన సహ ఉద్యోగులకు, మన సహవిశ్వాసులకు, అంతిమంగా దేవునితో ఉన్న సంబంధాలు, సహవాసాలు దెబ్బతినడానికి కారణంగా మారడం.

## డిజిటల్ వ్యసనం వర్సెస్ విగ్రహారాధన

నిజంగా మాట్లాడితే, స్మార్ట్‌ఫోన్‌లు, సోషల్ మీడియా యాప్‌లు, ఇంటర్నెట్, టి.వి.లు డిజిటల్ విగ్రహాలుగా మారిపోయాయి. డిజిటల్ వ్యసనం రూపంలో మన పూర్తి ఆరాధనను, సమయాన్ని అవి అందుకుంటాయి. ఇది సృష్టికర్తయైన దేవునికి వ్యతిరేకమైనది. ఎందుకంటే కీర్తన 1:2 ప్రకారం మన సమయం ఆయనది, మత్తయి 22:37 ప్రకారం మన ఆరాధన ఆయనది, అయితే అవి ఆయనకు అందడం లేదు. పది ఆజ్ఞలను గమనించినప్పుడు డిజిటల్ వ్యవసనం అనేది విగ్రహారాధనతో సమానమైనది. అది దేవుడు అసహ్యించుకునేది (నిర్గమ 20:4-5).

## డిజిటల్ వ్యసనం - ప్రవర్తనలో కన్పించే లక్షణాలు

డిజిటల్ వ్యసనం/ఇంటర్నెట్ వ్యసనపు రుగ్మతను నిర్ధారించుకోవడానికి, క్రింద పేర్కొన్న ఎనిమిది విషయాల్లో కనీసం 5 లక్షణాలు ఒక సంవత్సరములో మనలో కన్పిస్తే డిజిటల్ వ్యసనం మనలో ఉంది అని అర్థం చేసుకోవచ్చు.

1. ఏదో ఒక డిజిటల్ మీడియాను వాడుతూ ఉండడం.
2. డిజిటల్ మీడియాను వాడడం కుదరనప్పుడు మనలో కన్పించే తీవ్రమైన మార్పులు.
3. కోరికలను తృప్తిపరచుకోవడం కోసం డిజిటల్ మీడియాను వాడుకోవాలనే ఆశ పెరగడం.
4. డిజిటల్ మీడియాను వాడకుండా ఉండడానికి, వాడకాన్ని తగ్గించడానికి అనేకసార్లు ప్రయత్నించి ఓడిపోవడం.
5. గతంలో ఆనందం కల్గించిన పనులను డిజిటల్ మీడియాతో భర్తీ చేసుకోవడం.
6. ప్రతికూల పరిస్థితుల్లో కూడ డిజిటల్ మీడియాను వాడకుండా ఉండడానికి ఇష్టపడకపోవడం.
7. రహస్యంగా డిజిటల్ మీడియాతో గడపడం.
8. ఒత్తిడితో ఉన్నప్పుడు, ఒంటరిగా ఉన్నప్పుడు, పని లేకుండా ఖాళీగా ఉన్నప్పుడు ఉన్న పరిస్థితులను ఎదుర్కోవడానికి డిజిటల్ మీడియాను వాడడం.

## డిజిటల్ వ్యసనం - హానికరమైన పర్యవసానాలు (విద్యార్థి/ విశ్వాసి జీవితంలో)

ఎ. అపవిత్రమైన, ఇంద్రియ సంబంధమైన, అసభ్యకరమైన, అసహ్యకరమైన, దుర్భాషతో కూడిన వాటిని ఎక్కువ చూపించడం ద్వారా మనసులు పాడైపోవడం.

బి. అర్థంలేని కామెడి షోస్, రియాల్టీషోస్, డ్యాన్స్ షోస్ ద్వారా మనసులు పాడైపోవడం.

సి. అనైతికతను, భక్తిహీనతను, శత్రుత్వాన్ని, ఈర్ష్య, కోపం, విభేదాలు, కలహాలను ప్రోత్సహించడం ద్వారా మనసులు పాడైపోవడం.




డి. పాడైపోయిన మనసుల ద్వారా ప్రవర్తనలో తీవ్రమైన మార్పులు జరిగి భక్తిహీనతవైపు, పాపం వైపు నడిపించబడడం.

ఇ. దేవునితో, విశ్వాసులతో, సంబంధాలలో ప్రార్థన జీవితంలో అనూహ్య మార్పులు చోటు చేసుకోవడం.

ఎఫ్. ముఖ్యమైన, అవసరమైన విషయాలలో (చదువు/ ఉద్యోగం/కుటుంబము) ఆసక్తి కోల్పోవడం.

జి. చెడు సహవాసాలకు, పరాయి స్త్రీలతో/పరాయి పురుషులతో స్నేహాల కోసం అదనపు అనారోగ్య కరమైన ఆసక్తిని కనుపరచడం.

## డిజిటల్ వ్యసనాన్ని ఎదుర్కోవడం ఎలా?

యోహాను 8:32లో యేసుక్రీస్తు ప్రభువు తనను నమ్మిన యూదులతో చెప్పిన మాట "అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును" అని, అదే సూత్రం ఆధారం చేసుకొంటే సత్యమును తెలుసుకోవడం, అర్థం చేసుకోవడం, స్పృహ కల్గి ఉండటం ద్వారా డిజిటల్ వ్యసనాన్ని గెలవగలం.

దేవుని వాక్యము శరీర కోరికలు గురించి లోకపు ఆకర్షణల గురించి, వ్యసనపు ప్రవర్తన గురించి ఏమి చెబుతుందో ఈ కొన్ని వాక్యభాగాలను ధ్యానం చేస్తే తెలుస్తుంది. 1 యోహాను 2:16; 1 కొరింథీ 6:12, గలతీ 5:19-21, 1 పేతురు 5:8, రోమా 13:14, తీతు 2:11-12

ఈ వాక్యభాగాల వెనుక ఉన్న సత్యాలు, సూత్రాలు తేటతెల్లగా చెప్పేది, మనం అన్ని విషయాలలో చాలా జాగ్రత్తగా ఉండాలనే. మన శరీరపు ఆశలు మన జీవితంలో ఎలా పని చేస్తాయో, ఎలా పనిచేస్తున్నాయో ఎప్పుడూ చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉంది. మనము లోకపు ఆకర్షణలకు లొంగకుండా (అది డిజిటల్ రూపంలోనైనా మరి ఏవిధముగానైనా) ఆకర్షింపబడకుండా, వ్యసనంగా మారకుండా మనము బాధ్యత వహించాలి. అదే సమయంలో ప్రభువుపైన మనసు ఉంచి, దినదినం ఆధారపడుతూ, అన్ని విషయాలలో ఆశానిగ్రహం కల్గి జీవించడానికి బాధ్యత వహించాలి.

ఇక్కడ ప్రశ్న ఏంటంటే, యేసుక్రీస్తు ప్రభువును

నమ్మిన వ్యక్తిగా మన బాధ్యతల పట్ల యాజమాన్యాన్ని మనం తీసుకొంటున్నామా? లేదా? ఆయన ముందు మన జీవితాలకు లెక్క అప్పచెప్పవల సిన వారము అన్నట్లుగా జీవిస్తున్నామా? లేదా? ఈ ప్రశ్నలకు మనము నిజాయితీగా సమాధానం వెదుకుతున్నప్పుడు డిజిటల్ మీడియాకు బానిసల వ్వడం, వ్యసనంగా మారడం అనేది సంతోషమో, కాదో అర్థమవుతుంది. దేవుని వాక్యపు సత్యాలను, సూత్రాలను అనుసరించినప్పుడు డిజిటల్ వ్యసనం నుండి తప్పనిసరిగా విజయం పొందగలము.

## డిజిటల్ వ్యసనాన్ని జయించడానికి ముందు జాగ్రత్తలు

ఎ. సోషల్ మీడియాను సంతోషం కోసం ఒంటరిగా వాడకు.

బి. సోషల్ మీడియాను టైంపాస్ కోసం, సమయాన్ని దుర్వినియోగం చేయడానికి వాడకు.

సి. సోషల్ మీడియాను స్త్రీలతో సంబంధాల కోసమో, పురుషులతో సంబంధాల కోసం వాడకూడదు.

డి. సోషల్ మీడియాను తక్కువగా, పొదుపుగా వాడుకో.

ఇ. సోషల్ మీడియాను నిర్థిష్టమైన సమయంలోనే వాడుకో.

ఎఫ్. సోషల్ మీడియాను అవసరమైన వాటి కోసం అవసరమైనంత మేరకే వాడుకో.

## డిజిటల్ వ్యసనాన్ని జయించడానికి ఆచరణాత్మకమైన సలహాలు

ఎ. డిజిటల్ వ్యసనం, వాడకం అనేది ఎంత హానికరమైనదో, ప్రతికూలమైన ప్రభావాన్ని చూపిస్తుందో అర్థం చేసుకొని, అంగీకరించడం.

బి. డిజిటల్ మీడియా వాడకంనుండి ఉద్దేశపూర్వకంగా, స్పృహ కల్గి దూరంగా ఉండడం.

సి. ఆధ్యాత్మిక పుస్తకాలు, సాధారణ పుస్తకాలు, వార్తా పత్రికలు లాంటివి వాటిని చదవడంలో క్రొత్తగా దృష్టి పెట్టడం.

డి. డిజిటల్ రూపంలో లేని అలవాట్లు, ఆటలు వంటి వాటిపై కొత్తగా దృష్టి పెట్టడం.

ఇ. స్నేహితులతో సమయం, కుటుంబంతో సమయం గడపడం వంటి వాటిపై క్రొత్తగా దృష్టి పెట్టడం.

ఎఫ్. జీవితంలో ప్రతికూల ప్రభావాలపై విజయం కోసం ప్రార్థనపై కొత్తగా దృష్టి పెట్టడం.

## ఆచణాత్మకమైన స్వపరీక్ష ప్రశ్నలు

స్వపరీక్షకు సంబంధించిన ఏడు ప్రశ్నలు: వ్యక్తిగతంగా/ సమూహంగా

1. నేను, నా స్మార్ట్‌ఫోన్‌ను/కంప్యూటర్‌ను/టి.వి.ని సహజ సమాచార అవసరాలకు కాకుండా అదనంగా ఏమైనా వాడుతున్నానా?
2. నేను, నా సోషల్ మీడియాను సాధారణ సమాచార అవసరాలకు కాకుండా అదనంగా వాడుతున్నానా?
3. నేను, ఇంటర్నెట్/టి.వి/సినిమాలు అనేవి నా ఆలోచనలను, నా జీవితాన్ని ప్రభావితం చేస్తాయి, దేవునికి దూరంగా, లోకానికి దగ్గరగా తీసుకువెళ్తాయనే స్పృహలో లేకుండా ఉన్నానా?
4. డిజిటల్ వ్యసనాన్ని ఎదిరించడానికి నా జీవితంలో ఎలాంటి జాగ్రత్తలు తీపుకొంటున్నాను?
5. నా సమయాన్ని ఆకర్షించే, దొంగిలించే సోషల్ మీడియా యాప్?
6. నేను ఏ రకమైన డిజిటల్ సమాచారాన్ని వాడుతున్నాను?
7. నేను దేవుని వాక్యపు సత్యాలను, డిజిటల్ వ్యసనం నుండి బయటకు రావడానికి వాడుతున్నానా?

## ఆధ్యాత్మిక ఆరోగ్యపు ప్రశ్నలు

1. **నూతన విశ్వాసులైతే:** దేవునితో గడిపే సమయం ఎంత?
2. **స్థిర విశ్వాసులైతే:** దేవునితో గడపడానికి (వాక్య ధ్యానంలో, ప్రార్థనలో) రోజుకి 1-2 గంటలు కేటాయించడానికి, వారంలో 5 రోజులు కేటాయించడానికి నిర్ణయం తీసుకొంటావా?
3. **అవిశ్వాసులైతే:** ఈ రోజు యేసుక్రీస్తును స్వంత రక్షకునిగా అంగీకరించండి.

**డా॥ యం. బెన్ స్వరూప్,**

వైజాగ్ బైబిల్ ఫెలోషిప్, ప్లీనరీ ఇన్ స్ప్రైకాన్ 2022

**అనువాదం: యం. గాలెయ్య, భీమవరం**



# మన తరానికి సేవ చేయడం

గత సంచిక తర్వాత...

### 5. దావీదు దయ కలిగినవాడు, తను ఇచ్చిన వాగ్దానం పట్ల నమ్మకత్వం చూపినవాడు

రాజైన దావీదు దయార్థ హృదయుడు. దావీదులోని దయాగుణం దేవునితో తనకున్న సంబంధం వలన పెరిగింది. సౌలు కుటుంబీకులపట్ల అసాధారణమైన దయను కనపరిచాడు. సౌలు దావీదును తరిమి తన జీవితాన్ని దుర్భరం చేశాడు. అయితే దావీదు పగ తీర్చుకోవడానికి బదులు మంచితనం చూపించాడు. రోమా 12:19-21లో దావీదు సౌలు కుటుంబానికి చూపిన దయ క్రీస్తు మన యెడల చూపిన దయ, కృప, క్షమాపణ వంటిదే (రోమా 5:8). దావీదుకు సౌలును చంపడానికి అవకాశం వచ్చినప్పుడు సౌలు ను చంపక ఇతడు యెహోవా చేత అభిషేకం నొందినవాడు గనుక యెహోవా చేత అభిషిక్తుడైన నా రాజుకు నేను ఈ కార్యం చేయను, యెహోవాను బట్టి అతని నేను చంపను అని తన జనులతో చెప్పాడు. 1 సమూ 24:5-6 లో దావీదు దేవునికి భయపడడం, ఆయన అభిషేకించిన రాజును గౌరవించటం చూస్తాం.

యేసుప్రభువు తాను ఇచ్చిన వాగ్దానాలకు కట్టుబడి నమ్మకంగా ఉన్నట్లు దావీదు కూడ తను చేసిన వాగ్దానానికి కట్టుబడి ఉన్నాడు. 1 సమూ 20:42; 18:3-4లో దావీదు యోనాతానుకి తను చనిపోయిన సౌలు కుటుంబం పట్ల తన ప్రేమను కొనసాగిస్తానని మాట ఇచ్చాడు. అలాగే దావీదు తను ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాడు. 2 సమూ 9:1లో యోనాతానును బట్టి నేను ఉపకారం చూపుటకు సౌలు కుటుంబంలో ఎవడైన కలడాయని దావీదు అడిగినట్లు చూస్తాం. 2 సమూ 9:7లో దావీదు యోనాతాను కుమారుడైన మెఫీబొషెతుతో భయపడవద్దు, నీ తండ్రియైన యోనాతాను నిమిత్తం నిజముగా నేను నీకు ఉపకారం చూపెదను అని చెప్పడం చూస్తాం.

దావీదు తన శత్రువుపై పగ తీర్చుకోక క్షమించడం అనేది దావీదు జీవితం నుండి మనం నేర్చుకొనవల సిన సవాలుకరమైన పాఠం (రోమా 12:9-21). ఈ రోజుల్లో క్రైస్తవ నాయకులు, ప్రసంగీకులు ఒకరి నొకరు క్షమించుకోక పగతీర్చుకోవటం వలననే సంఘాలు సహవాసాలు విభాగించబడుతున్నాయి. మనమందరం దావీదు వైఖరిని అవలంభించి మన తరానికి సేవ చేయడానికి మనలను మనం తిరిగి సమర్పించుకొందాం.

## 6. దావీదు స్త్రీల విషయంలో బలహీనుడైనా, పాపం ఒప్పుకొనే విషయంలో సంసిద్ధుడు

దావీదు ఎన్నో విషయాలలో బలవంతుడైనా స్త్రీ విషయంలో బలహీనుడు. అది వసంత కాలం. రాజులు యుద్ధానికి బయలుదేరే సమయం. కానీ దావీదు యెరూషలేములో నిలిచిపోయాడు (2 సమూ 11:1). దావీదు అలా నిలిచిపోవడం తప్పుడు నిర్ణయం, అలా యుద్ధానికి వెళ్ళకుండ ఉండడం తనకు వాడుక కాదు. సాయంకాలమైనప్పుడు దావీదు పడక మీద నుండి లేచి మిద్దె మీద నడుస్తున్నాడు. అక్కడ నుండి ఒక సౌందర్యవతియైన స్త్రీ స్నానం చేయడం చూసి, దూతలను పంపి, ఆమెను పిలిపించాడు. ఆమె వచ్చినప్పుడు ఆమెతో శయనించాడు. ఆ తరువాత ఆమె గర్భవతి అయినట్లుగా రాజుకి సమాచారం పంపింది (2 సమూ 11:2-5). దావీదు ఆమె భర్తను యుద్ధ భూమిలో చంపించి, ఆమెను భార్యగా చేసుకోవడానికి కుట్ర చేశాడు. ఆ తరువాత ప్రవక్తయైన నాతాను దావీదును తీవ్రంగా గద్దించాడు (2 సమూ 12:7-12). అప్పుడు దావీదు నాతానుతో "నేను దేవునికి విరోధంగా పాపం చేశాను అని ఒప్పుకొన్నాడు. అప్పుడు నాతాను "నీవు చావకుండునట్లు యెహోవా నీ పాపమును పరిహరించెను" (2 సమూ 12:13) అని చెప్పాడు. అలా దావీదు తన పాపాన్ని కప్పుకోకుండా దానిని బహిరంగంగా ఒప్పుకొని తన్నుతాను సరిచేసుకొన్నాడు (కీర్తన 51:1-10).

మనం జాగ్రత్తగా ఉండకపోతే శోధించబడి పాపంలో పడిపోయి మన సాక్ష్యాన్ని, పరిచర్యను పాడుచేసుకొనే అవకాశం ఉంది. ఇలాంటి శోధనలో చాలామంది నాయకులు, ప్రసంగీకులు పడిపోయి తమ పరిచర్యను పోగొట్టుకున్నారు. నీ జీవితంలో, పరిచర్యలో ఎంత జాగ్రత్తపడుతున్నావు?

## 7. దావీదుకి దేవుని మందిరం కట్టాలనే ఆశ ఉంది

దావీదుకు, దేవునికి ఒక ఆలయం కట్టాలనే మహత్తరమైన కోరిక ఉండేది (1 దిన 17:1). దావీదు తన ఇంటనుండి ప్రవక్తయైన నాతానును పిలిపించి – "నేను దేవదారు మ్రానులతో కట్టబడిన నగరులో నివాసం చేయుచున్నాను. యెహోవా నిబంధన మందసము తెరల చాటున ఉన్నది" అని చెప్పినప్పుడు నాతాను అది మంచి ఆలోచన అని అనుకొని దావీదు తన ఆలోచన ప్రకారం తన ప్రణాళికను అనుసరించి చేయమని ప్రోత్సహిస్తాడు (1 దిన 17:2). ఆ రాత్రి దేవుని వాక్కు నాతానుకి ప్రత్యక్షమై "నీవు పోయి నా సేవకుడైన దావీదుతో – నా నివాసంకై యొక ఆలయం కట్టించుట నీ చేత కాదు" అని యెహోవా సెలవిచ్చెనని చెప్పమన్నాడు (2 దిన 17:4). దేవుడు దావీదు కుమారుని ఆయన ఆలయ నిర్మాణం చేయడానికి ఎంపిక చేసుకొన్నాడు. దేవుడు దావీదు సంతానానికి వాగ్దానం చేశాడు. "నీ కుమారుల వలన కలుగు నీ సంతతిని నేను స్థాపన చేసి అతని రాజ్యమును స్థిరపరచెదను. అతడు నాకు ఒక మందిరమును కట్టించును. అతని సింహాసనమును నేను నిత్య స్థాపన చేసెదను. నేను అతనికి తండ్రినైయుందును, అతడు నాకు కుమారుడైయుండును. అతనికి నా కృప చూపక మానను. నా మందిరమందును నా రాజ్యమందును నేను నిత్యము ఇతని స్థిరపరచెదను. అతని సింహాసనము ఎన్నటెన్నటికిని స్థిరముగా వుండును" (1 దిన 17:10-14; 2 దిన 7:11-14). ఇక్కడ సమీప సందర్భంగా దావీదు కుమారుడైన సొలొమోను గురించి అని అర్థం చేసుకోవాలి, అలాగే సుదూర సందర్భంగా అది దావీదు కుమారుడైన రాజులకు రాజైన యేసుప్రభువు గురించి అని అర్థం చేసుకోగలం.

ఈ విషయాలకు దావీదు స్పందిస్తూ దేవునిని స్తుతిస్తూ ఇలా ప్రార్థించాడు. దేవా, నీవే నీ దాసుని నిమిత్తము నీ చిత్త ప్రకారమే, ఈ మహాఘనత కల ుగునని నీవు తెలియజేసియున్నావు, అతని నిమిత్తమే నీవు ఈ గొప్ప కార్యములు చేసియున్నావు. ఇప్పుడు నీ దాసుని సంతతి నిత్యము నీ సన్నిధిని ఉండునట్లుగా దానిని ఆశీర్వదింప అనుగ్రహించియున్నావు. యెహోవా నీవు ఆశీర్వదించిన యెడల అది ఎన్నటె న్నటికి ఆశీర్వదించబడినదే (1 దిన 17:16-27).

ఇలా ప్రార్థించిన తరువాత దేవుని ఆలయాన్ని కట్టడానికి దావీదును నిషేధించడం వలన, ఆలయ నిర్మాణానికి అవసరమైన వస్తువులు, నిర్మాణానికి కావలసిన ప్రణాళికలను సిద్ధం చేయడంలో సహాయం చేశాడు. ఆ తరువాత తన కుమారుడైన సొలొమోనుతో "ఇదిగో కష్ట స్థితిలోనే ప్రయాసపడి యెహోవా మందిరము కొరకు రెండు లక్షల మణుగుల బంగారమును పది కోట్ల మణుగుల వెండిని తూచ

శక్యము కానంత విస్తారమైన ఇత్తడిని ఇనుమును సమకూర్చియున్నాను. మ్రానులను రాళ్ళనుకూర్చి యుండితిని, నీవు ఇంకను సంపాదించుదువు గాక. కాబట్టి పని పూనుకొనుము, యెహోవా నీకు తోడుగా ఉండును గాక (1 దిన 22:14-16).

దావీదు దేవుని చిత్తాన్ని ఎంతో తగ్గింపుతో "నీవు కాదు నీ కుమారుడు నా కొరకు మందిరం కట్టిస్తాడు అని చెప్పినప్పుడు అంగీకరిస్తాడు. దేవుని మందిరం కట్టడానికి దావీదు దగ్గర అవసరమైనవన్ని ఉన్నప్పటికి దేవుని చిత్తానికి ఉద్దేశాలకు వినయంగా విధేయత చూపాడు. ఈ సందర్భంలో దేవుడు నిత్య రాజ్యం గూర్చిన గొప్ప ఉద్దేశాలు మనకు బయలు పరచాడు. క్రీస్తు యొక్క పని మనముందుంచాడు. మనలో ఎంతమందిమి దావీదులా దానిని అంగీకరించగలం.

## మన తరం యొక్క అవసరత

ఈ రోజుల్లోని బిజీ జీవనశైలి కుటుంబ సంబంధాలు బలహీనపడడానికి కారణం అవుతుంది. క్రైస్తవుల్లో కూడా విడాకుల సంఖ్య పెరిగిపోవడం చూస్తున్నాం. స్వలింగ వివాహాలు అనే కొత్త జీవన శైలి కుటుంబ వ్యవస్థను అతలాకుతలం చేస్తుంది. ఈ రోజుల్లోని పిల్లలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎంతో బిజీగా ఉంటున్నారు. యవ్వనస్థులు, కళాశాల విద్యార్థులు అనేక రకాల గాడ్జెట్స్‌తో బంధించబడి తప్పుదారిలో నడిపించబడుతున్నారు. ఉద్యోగస్తులు, విద్యావంతులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, మీడియా వారు ఎంతో బిజీగా ఉంటూ సంతృప్తిలేని జీవితాలు జీవిస్తున్నారు. ఈ తరం వారు మానవ ప్రాథమిక అవసరతల కోసమే తపించిపోతున్నారు. అయితే వారు ప్రేమ, సత్యం, నమ్మకత్వం, నిజాయితీ, అంగీకారం, గుర్తింపు, జీవితం యొక్క ఉద్దేశం మరియు ప్రాముఖ్యతలు తెలుసుకోలేని వారుగా ఉన్నారు. వేరే విధంగా చెప్పాలంటే తమ గుణాన్ని తమ జీవితాలను కట్టే నిజ దేవునిని, సత్యాన్ని వారు తెలుసుకోవాల్సిన వారుగా ఉన్నారు.

## సంఘం, మిషన్స్ యొక్క పాత్ర

సంఘాలు, సంస్థలు, క్రైస్తవ మిషన్స్ ఈ రోజుల్లోని సవాళ్ళను ఎదుర్కోలేక, సువార్త పొలం యొక్క అవసరతలు తీర్చలేనివిగా ఉన్నాయి. సువార్త పొలం యొక్క అవసరాలకనుగుణంగా నేటి సంఘాలు, క్రైస్తవ మిషన్స్ వ్యక్తులను దేశాన్ని ప్రభావితం చేయలేనివిగా కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితిని బట్టి దేవుడు ఏదో ఎక్కడో పట్టనట్లుగా ఉన్నాడని అర్థం చేసుకోకూడదు.

దేవుని ప్రణాళికలు, ఉద్దేశాలు అన్ని కాలాలలో ఉన్నాయి. ఆయన వాటిని నెరవేర్చుకుంటూ ఉంటాడు. ఆయన తన పిలుపుకు, చిత్తానికి, ఉద్దేశాలకు తమ్మును ప్రత్యేకించుకోగలిగే వ్యక్తుల కోసం ఎదురుచూస్తున్నాడు. దేవుని ప్రజలు ఐగుప్తు బానిసత్వంలో బాధపడుతూ ఉంటే వారిని విడిపించడానికి మోషేను లేపుకొన్నాడు. తరువాత వారిని వాగ్దాన భూమిలోకి నడిపించడానికి యెహోషువను వాడుకున్నాడు. సౌలు రాజు విఫలమైనప్పుడు దావీదును ఇశ్రాయేలీయులకు రాజుగా లేపుకొన్నాడు. 1 సమూ 16:1-13లో తన తరము వారికి సేవ చేసి దేవుని కోసం జీవించిన దావీదు యొక్క సమర్పణలో ఏడు విషయాలు చదవగలం. ఆ తరువాత దావీదును లోక రక్షకుడైన యేసుప్రభువుకు మూల పితరునిగా, అన్ని తరాల వారికి ఒక మాదిరికరమైన రాజుగా చూస్తాం.

కాలం సంపూర్ణమైనప్పుడు 1940లో దేవునికి కళాశాల విద్యార్థుల మధ్య పరిచర్య ప్రారంభించడానికి ఒకరు అవసరమయ్యారు. అలా 1950లో దేవుడు దీన దాసుడైన ప్రొ. ఇనాక్ గారిని ఆయన సతీమణిని పిలిచి పరిచర్య ప్రారంభించడానికి వాడుకొన్నాడు. వారి విధేయత వలన వారి విశ్రాంతి గదిలో ప్రారంభమైన చిన్న వాక్య పఠన గుంపు నేడు యుఇయస్ఐ అనే పెద్ద సంస్థగా ఎదిగింది. వేల కొలది విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్, కుటుంబాలు, సంఘాలు, సంస్థలు యుఇయస్ఐ ద్వారా ఎంతో ఆశీర్వదించబడ్డాయి. యుఇయస్ఐ ఫలాలు భారతదేశంలోని అన్ని రాష్ట్రాలకు ప్రపంచలోని అన్ని ఖండాలకు వ్యాపించాయి. ఎంతటి ఆశీర్వాదం, దేవునికి ఎంత గొప్ప మహిమ, మరి నీవు కూడా అలా దేవుని కోసం, అనేకుల ఆశీర్వాదం కోసం వాడబడాలని కోరుకొంటున్నావా?

- యం. కృష్ణయ్య, యుఇయస్ఐ-ఏపి మాజీ స్టేట్ సెక్రటరీ, హైదరాబాద్
అనువాదం: సిస్టర్. స్వాతి, స్టాఫ్

ప్రత్యేకం



# ప్రభావవంతమైన సౌవార్తీకరణ

## యేసుక్రీస్తు మాదిరి మత్తయి 9:35-10:1

యేసుని ప్రేమ – యేసువార్త
వాసిగచాటగ వెళ్ళుదము
ఆశతో యేసు సజీవ సాక్షులై
దిశలన్నిటను వ్యాపించెదము
వినుము ప్రభుని స్వరము (2)

ప్రభుయేసు సన్నిధి తోడురాగా – కడుదూర తీరాలు చేరెదము

ఈ పాటను అనేకసార్లు మనం పాడుకొంటూ ఉంటాం. ఇది కేవలం పాడడానికేనా? లేక ఆయనలా పనిచేయడానికి కూడానా? సువార్తల్లో యేసుక్రీస్తు ప్రభువును నిరంతరం సేవ చేసే వ్యక్తిగా మనం చూస్తాము. ఆయన పరిచర్యలో బోధ, ప్రకటన, స్వస్థతలను, నశించిన వారిని వెదకి రక్షించాలనే తీవ్రమైన ప్రయాసను కూడా చూస్తాము. ఆయన మరణం దగ్గరయ్యే కొద్దీ మరెక్కువగా ఆయన సేవ చేశారు. ఈ వ్యాసంలో ఆయన ఎలా సేవ చేశాడో చూద్దాం.

### 1. యేసుక్రీస్తు దర్శనం కలిగి ఉన్నాడు

యేసుక్రీస్తు ఒక విజన్‌తో అనుక్షణం పని చేశారు. అది మానవుని అక్కరలు చూడగలిగే విజన్, దుష్టుని యొక్క అధికారంనుండి మానవాళిని రక్షించాలనే విజన్. ఆత్మీయ అంధకారంలో ఉంటూ నశించిపోతున్న వారిని నిత్య నరకం వైపు వెళ్తున్న మానవాళిని రక్షించాలనే తపన ఆయనది. ఆ విజన్‌తోనే ఆయన పని చేసారు. 36వ. వచనంలో వారిని **చూచి, కనికరపడి** అనే మాటలు చాలా అర్థాన్ని ఇస్తాయి. ఆయన మనుష్యులను మనుష్యులుగా చూస్తాడు, ఆయన ఏమి చూశాడు అని ఆలోచిస్తే, వారి హృదయంలో ఉన్న శూన్యత, వాళ్ళ జీవితంలో ఉన్న నిజమైన అక్కరలను ఆయన చూశాడు.

కాలేజ్, ఆఫీస్‌లలో ఉన్న ప్రజల నిజమైన అవసరాలను మనం చూడాలి. వారి ఆధ్యాత్మిక అవసరతను మనం అర్థం చేసుకోవాలి. చాలామంది మన చుట్టూ అలాంటి శూన్యతతో బతుకున్నారు. విద్యార్థి లోకం అనేక సంకెళ్ళతో ఉన్నారు, వారి హృదయంలో చెడు, అపవిత్రత రాజ్యమేలుతున్నాయి. నిజమైన శాంతి లేక కొట్టుమిట్టాడుతున్నారు. వారి అక్కరత వారికి తెలియదు, బయటకు బాగుంటున్నారు కానీ వారు నశించిపోయే ఆత్మ అని వారికి తెలియదు. నరకానికి వెళ్ళే మార్గంలో ఉంటున్నారు.

అయితే యేసుక్రీస్తు ప్రభువు కలిగి ఉన్న విజన్, భారాన్ని పౌలు కూడా కలిగి ఉంటూ తనకు కలిగిన పరలోక దర్శనం గూర్చి అగ్రిప్ప రాజు ముందు చెబుతూ 'ఆ పరలోక దర్శనానికి అవిధేయుడను కాను' అని చెబుతున్నాడు.

ఈ దర్శనం దేవునిదగ్గర నుండి వచ్చింది. మనమందరం నిత్య నరకానికి పయనిస్తూ ఉంటే ఆ యేసయ్య దర్శనం మనలను తాకి నిత్య రాజ్యమైన పరలోకానికి మరల్చింది.

1970 జూన్ 14న నన్ను ఆ దర్శనం పట్టుకుంది.

నిత్యజీవాన్ని ఇచ్చింది. ఈ 52 సం॥లుగా ఆయన నన్ను నడిపిస్తున్నాడు.

మనం దేవునితో సంధించబడ్డాము. మిగిలినవారి సంగతేమిటి? మనచుట్టూ ఉన్న వారిపట్ల యేసయ్య దర్శనంతో పనిచేయాల్సిన అవసరం లేదా? కాలేజ్‌లో యూనివర్శిటీలో ఉన్న విద్యార్థులు తమ జీవితాలకు గమ్యం లేకుండా, శూన్యతలో, నిత్య నరకం వైపు పయనిస్తూ ఉంటే మనకు భారం కలగడం లేదా?

ప్రొఫెసర్ ఇనాక్ గారితో దేవుడు 'ఆ మెడికోస్‌కి, విద్యార్థులకు ఎవరు సువార్త చెబుతారు?' అని మాట్లాడితే, ఆయన వారి గురించి ప్రార్థించి, గొప్ప సేవ చేశారు.

గొప్ప సంగతులు జరగాలంటే రెండు ఆపేక్షలు కావాలి.

1. అనుకూల సమయం 2. పనిచేసే వ్యక్తులు.

దేవుడు మనకు చాలా అనుకూల సమయాన్ని ఇస్తున్నాడు, అయితే పనిచేసేవారు ఎవరు? ఈ రోజులలో విజన్‌తో పనిచేసే వారు కొదువుగా ఉన్నారు. విజన్ లేకుండా పనిచేస్తే ఉపయోగం లేదు.

దావీదు కాలంలో అహీమెలెకుకు అనేవాడు యుద్ధంనుండి దావీదు వద్దకు వెళ్ళి వర్తమానం చెప్తాను అంటాడు. అప్పుడు యోవాబు "దావీదు దగ్గరకు తీసుకొనివెళ్ళడానికి నీ దగ్గర సందేశమేంటి?" అంటే అహీమెలెకు వద్ద సమాధానం లేదు. కానీ పరిగెత్తుకొని వెళ్తాను అని అలాగే వెళ్తాడు. దావీదు అతనిని ఏ సందేశం తెచ్చావు అని అడిగితే 'ఏదో గలిబిలి జరుగుతుంది అంటాడు".

అహీమెలెకుకి ఆసక్తి ఉంది, పరిగెత్తాడు, కానీ సందేశం స్పష్టంగా లేదు. ఎందుకు పరుగెడుతున్నాడో స్పష్టత లేదు.

అలాగే విద్యార్థులముగా, గ్రాడ్యుయేట్స్‌గా పరలోక దర్శనం లేకుండా ప్రజల యొక్క నిత్య అవసరాన్నిఅర్థం చేసుకోకుండా మనం పనిచేస్తున్నాము. చాలామంది విశ్వాసులు స్పష్టమైన సందేశమేదీ లేకుండానే పరుగెత్తుతుంటారు.

ఎప్పుడైతే దర్శనం వస్తుందో, అప్పుడే నిజమైన నాయకత్వం ప్రారంభమవుతుందని జాన్ హగ్గయ్ అంటాడు. దర్శనం లేకుండా పనిచేస్తే ఫలితం పొందలేము. యేసయ్య దర్శనం కలిగినవాడు. యేసయ్యను ఎంతగా నీవు అర్థం చేసుకొంటావో, అంతగా నీవు దర్శనం కలిగి పనిచేస్తావు.

యుఇయస్ఐలో 7000 మంది గ్రాడ్యుయేట్స్ ఉన్నారు. అందరు విజన్‌ని అర్థం చేసుకొని, పనిచేస్తే భారతదేశ స్వరూపం మారిపోతుంది. యుఇయస్ఐ-ఏపిలో ఉన్న గ్రాడ్యుయేట్స్, స్టాఫ్ అందరం యేసయ్యలాంటి విజన్ కలిగి పనిచేద్దాం.

"నీవు సువార్తికుడవు కావొచ్చు, ధారాళంగా ప్రసంగించే గొప్ప ప్రసంగీకుడవు కావొచ్చు, అయినా నీవు ఆత్మలను సంపాదించలేకపోతే కేవలం వ్యర్థమే" అని అంటాడు జాన్ వెస్లీ. "ఆత్మలను రక్షించడం కంటే యోగ్యమైన కార్యం కనబడదు. మరి దేనిలో ఆనందం లేదు" అని అంటాడు చార్లెస్ స్పర్జన్.

## 2. యేసుక్రీస్తు కనికరం కలిగినవాడు

ఎందుకు ప్రభావవంతంగా పని చేయలేక పోతున్నాం? మన చుట్టూ ఉన్న వారిని ఎందుకు సంపాదించలేకపోతున్నాము? కారణం బహుశా ప్రేమ లేకపోవడమే.

యేసు ప్రజలను చూచి కనికర పడ్డాడు. యేసుక్రీస్తు ప్రభువు మూడుసార్లు ఏడ్చాడు.

1. లాజరు చనిపోయినప్పుడు
2. పాపమనేది మానవ జీవితంలో భయంకరంగా పని చేస్తున్నప్పుడు ఆయన వేదనపడ్డాడు
3. యెరూషలేము స్థితిని బట్టి చాలాసార్లు "కోడి తన పిల్లలను రెక్కల క్రింద చేర్చుకొన్నట్లు నేను చేర్చుకోవటానికి ప్రయత్నించాను. కానీ మీరు రాలేదు" అని ఆయన వేదనపడ్డాడు.

ఆత్మలను గెలుచుకోవడానికి ఒక రహస్యం ఏంటంటే ప్రేమ కలిగి ఉండడమే. నశించిపోతున్న ఆత్మల పట్ల ప్రేమ, కనికరాన్ని చూపించడం. విద్యార్థులకు సువార్త ప్రకటిస్తున్నాము, అనేక సౌవార్తిక కార్యక్రమాల్ని కలిగివుంటున్నాం. కానీ వారి పట్ల కనికరము, ప్రేమ, కలిగి ఉన్నామా? వారి పట్ల ప్రేమను చూపించగలుగుతున్నామా? ప్రేమతో సువార్తను ప్రకటిస్తే దానిలో శక్తి ఉంటుంది.

యేసుక్రీస్తు వలె విద్యార్థుల పట్ల, గ్రాడ్యుయేట్స్ పట్ల ప్రేమను కలిగి ఉందాం. ప్రేమతో సువార్తను ప్రకటిద్దామా!

### 3. యేసుక్రీస్తు ప్రార్థనాపరుడు

యేసుక్రీస్తు మనముందు ఒక మాదిరిని ఉంచారు. పగలు, రాత్రి ఆయన ఆత్మల రక్షణ కొరకు ప్రార్థించారు. రాత్రి అంతా, ఉదయమునే, సాయంత్రం వేళ ఆయన ప్రార్థించారు. సువార్త ప్రకటించడానికి ఆయన ప్రార్థించారు, వారు తమ మార్గములను తిప్పుకోవడానికి ఆయన ప్రార్థించారు.

సువార్త ప్రకటించాలనే మనసు కలిగి ఉండడం మంచిది,దానికి ముందు మనం క్రీస్తువలె ప్రార్థించాలి. ప్రార్థన వారి హృదయాలను సువార్త కొరకు సిద్ధపరుస్తుంది. నశించిపోతున్న వారి కొరకు ప్రార్థించాలి. యుఇయస్ఐ పరిచర్య ప్రార్థనా పునాదిమీద కట్టబడింది. ప్రార్థన మనకు ఊపిరి. అనేక బంధకాల్లో ఉన్న విద్యార్థులు వాటినుండి విడుదల పొంది రక్షణ పొందాలంటే వారి కొరకు ప్రార్థించాలి. కాలేజ్‌ల కొరకు ప్రార్థించాలి. రక్షణ పొందిన వారు విశ్వాసంలో స్థిరపడేటట్లు మనం ప్రార్థించాలి. సరైన ప్రార్థన లేకుండా పనిచేస్తే అది వ్యర్థమే. గనుక ప్రతి విషయానికి ప్రార్థన చాలా ప్రాముఖ్యమని గ్రహించాలి.

విజన్, విజ్ఞాపన రెండూ కలిసి ప్రయాణిస్తాయి. రెండిటిని వేరు చేయలేము.

### 4. యేసుక్రీస్తు పనిచేసేవాడు

యేసుక్రీస్తు పనిచేసే వ్యక్తి. నిరంతరాయంగా ఆయన పనిచేశారు. అనేకసార్లు నా తండ్రి పని మీద ఉన్నాను అంటాడు. మనం ప్లాన్ చేసేవారం మాత్రమే కాదు, ప్రేయర్ చెయ్యాలి, పని చెయ్యాలి.

యుఇయస్ఐ-ఏపిలో చాలా పని జరిగిందని మనం అనుకొంటున్నాము కానీ, 1% మాత్రమే జరిగింది అని రిపోర్ట్స్ చెబుతున్నాయి. ఎన్నో కాలేజి సెంటర్స్ ఇంకా రీచ్ అవ్వలేదు, ఎన్నో కాలేజ్‌లు ఇంకా రీచ్ అవ్వలేదు. గ్రాడ్యుయేట్‌గా స్టూడెంట్‌గా నీకు, నాకు భారం ఉందా? పని చేయగలుగుతున్నామా? అనేకమంది నశించిపోతూ ఉంటే పని చేయడానికి ఆయన నిన్ను పిలుస్తూ ఉన్నప్పుడు ఆయనకు లోబడతావా? పని చేస్తావా? విజన్ కలిగి పని చేస్తావా? ప్రేమ, కనికరాలతో సువార్తను అందిద్దామా? ప్రార్థిస్తూ, నశించే వారికి సువార్త ప్రకటిద్దామా? శ్రమ పడడానికి ఇష్టపడుతున్నావా? యేసయ్యలా పని చేయడానికి ఇష్టపడుతున్నావా? ప్రభువు ఎదుట మంచి నిర్ణయాలు తీసుకుందాం.

గోదావరి రీజినల్ స్ప్రైకాన్ చివరి సందేశం

– **యం.యస్.రవికుమార్,** కావలి

**కూర్పు: వియస్ రామకృష్ణ,** ప్లానింగ్ అండ్ ఇవాల్యేషన్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ, అమలాపురం

## పెళ్ళి-దేవుని చిత్తం

దేవుని చిత్తాన్ని
చిత్తుకాగితంలా చింపేసి

దేవుని వాక్యాన్ని
దురాశలకు అన్వయించి

దేవుని ఆత్మను దు:ఖపెట్టి
ప్రార్థనను పక్కకు నెట్టి

దైవ నిర్ణయాన్ని
ధైర్యంగా ధిక్కరించి
దేవుని మహిమకు
మసిని చేర్చి

దేవుని సహవాసాన్ని
దుయ్యబట్టి
విలువలను వెనుకకు నెట్టి

పెద్దల మాదిరిని పాతిపెట్టి
దాగివున్న కోరికలను
తిరిగితవ్వి

బాలాకు మాటవిని
బిలాము గాడిదనెక్కి

కట్న కానుకల కోసం
లోకమర్యాదలు అనుసరించి

సంతలో పశువువై
కొంతైనా సిగ్గులేక

అందమని భ్రమసి
బంధకాల చిక్కి

కులగోపురమెక్కి
గుణము గాలికొదిలేసి

పెళ్లి పల్లకిలో ఊరేగే నీవు
పెళ్లికొడుకువా???
లేక ఊసరవెల్లివా???

– **ప్రమీలా ఆడమ్,** చింతలపూడి



# అనుకూల సమయం

**సువార్తకై... మొదటి సంవత్సర విద్యార్థుల రక్షణకై....**

రాత్రి 11 గంటలవుతుంది. తేజ, మంచము మీద పడుకొన్నాడు గాని నిద్ర పట్టలేదు. ఎంతో ఇష్టంగా తీసుకున్న కంప్యూటర్స్ బ్రాంచ్ కోసం, ఇంజనీరింగ్ కాలేజ్‌లో అడుగుపెట్టబోతున్నాడు. ఇంటికి దూరంగా వెళ్తున్నాను... ఇక నా ఇష్టం అనే సంతోషం, అమ్మా, నాన్నలను వదిలిపెట్టి హాస్టల్‌లో ఎలా ఉండాలి? అనే బాధ, ర్యాగింగ్ ఉంటుందేమో! అని భయం, కాలేజ్ లైఫ్ ఎలా ఉంటుందో! అనే ఆందోళన, ఎవరైనా తెలిసినవారు కాలేజ్‌లో ఉంటే బాగుండు అనే ఆశ...! ఇలాంటి ఆలోచనలతో మెల్లగా నిద్రలోకి జారుకొన్నాడు.

మరునటి రోజు... తేజ, పేరెంట్స్‌తో కలిసి భీమవరంలోని ఇంజనీరింగ్ కాలేజ్‌లో జాయినైయ్యాడు. దానితోపాటు కాలేజ్‌కి దగ్గర ఉన్న హాస్టల్‌లో కూడా జాయిన్ అయ్యాడు. ఆ రోజు సాయంత్రానికి పేరెంట్స్ ఊరు వెళ్తుంటే ఒప్పుకోక, తనతో పాటే హాస్టల్‌లో ఉండమన్నాడు. వాళ్ళు ఉండిపోయారు.

కరోనా తెచ్చిన ఆలస్యం వలన, మరుసటి రోజే క్లాస్‌లు ప్రారంభించారు. తేజ, అమ్మ, నాన్నతో కలిసి కాలేజ్‌కి వెళ్ళాడు. చాలామంది తనలాగే పేరెంట్స్‌తో క్లాస్‌కు వస్తున్నారు. చాలా చాలా జాగ్రత్తల నడుమ, నడక సాగిస్తున్నారు.

కాలేజ్ అంతా సందడిగా ఉంది. ఎక్కడ చూసినా కుర్రకారుతో కళకళలాడుతూ ఉంది. భలే ఉంది కదా అని అనుకొంటూ, తన క్లాస్‌రూమ్ వైపు నడుస్తున్నాడు. తనకు ఎదురవుతున్న అమ్మాయిలను చూసి కలరింగ్ బావుంది.. అని అనుకొంటూనే, అమ్మ పక్కనే ఉంది అని... తప్పు తప్పు అంటూ తనకుతానే చెప్పుకున్నాడు. ఎవరైనా తెలిసినవారు కన్పిస్తే బావుండు అని అనుకొంటూనే క్లాస్‌రూమ్‌కి వెళ్ళిపోయాడు. అమ్మకి, నాన్నకి బై బై చెప్పడం చాలా కష్టంగాను, బాధగాను అన్పించింది. తేజకి కన్పించకూడదని అమ్మ కన్నీళ్ళు తుడుచుకుంటుంటే, అమ్మకి కన్పించకుండా తేజ కన్నీళ్ళు ఆపుకున్నాడు.

తేజకి చాలా కష్టంగా పది రోజులు గడిచి పోయాయి. ర్యాగింగ్ తెలియకుండానే జరుగుతుంది. కొంతమంది ఎదురుతిరుగుతున్నారు. మరి కొంతమంది ర్యాగింగ్ చేయించుకొంటున్నారు. చాలా భయంగా అన్పిస్తుంది, ఎవరు లేరనే ఒంటరితనం, ఎంజాయ్ చెయ్యలేకపోతున్నాను అనే నిరాశ,

ఇంటికి వెళ్ళిపోదామన్నంతగా నలిగిపోసాగాడు. ఎవరైనా పిలిస్తే వణుకు వచ్చేస్తుంది. చాలాసార్లు బాత్‌రూమ్‌లోకి వెళ్ళి ఏడ్చేవాడు. ఎవరైనా తెలిసిన సీనియర్స్ ఉంటే బాగుండు అనే ఆశ మరీ ఎక్కువయ్యింది. ఇంతలో ఒక సీనియర్ వచ్చి ర్యాగింగ్ కోసం తనతో తీసుకువెళ్ళాడు.

ఒకరోజు సాయంత్రం,

తేజకి క్లాస్ అయిన తర్వాత హాస్టల్‌కి వెళ్ళడానికి భయపడి, ఎవరికి కన్పించకుండా కాలేజ్‌లోనే ఒక చెట్టు చాటున కూర్చున్నాడు. కాసేపటికి ఎవరో తనవైపు వస్తున్నారని అర్థం అయ్యింది. మనసులో భయం మొదలయ్యింది, అక్కడనుండి వెళ్ళిపోవడానికి లేచి బయలుదేరబోతుంటే, 'తమ్ముడు' అనే పిలుపుకి ఆగిపోయాడు. గత పది రోజులనుండి అలాంటి పిలుపు విన్పించలేదు, అంత ఆప్యాయత కూడా కన్పించలేదు. వెంటనే తమ్ముడు, 'నీ పేరేంటి, ఫస్ట్ ఇయరా?' అని అడిగేసరికి... 'అవును సార్' అంటూ తేజ బదులిచ్చాడు. సార్ వద్దులే కానీ 'అన్న' అని పిలువు అంటూ తేజ భుజం మీద చెయ్యివేసి, తన పేరు 'అభిషేక్' అని, 'మెకానికల్ థర్డ్ ఇయర్' అని చెప్పి, తనతోపాటు కూర్చొని, మాట్లాడసాగాడు.

తేజ మనస్సులోని భయం, ఎవరు లేరనే ఒంటరితనం అంతా పోయింది. చాలా రిలాక్స్‌గా అన్పించింది. ఒత్తిడినుండి విడుదల పొందడం మొదటిసారి అనుభవంలోనికి వచ్చింది. చాలా సంతోషంతో, చాలాసేపటి తర్వాత వెళ్ళొస్తాను 'అన్న' అంటూ తన నెంబరు ఇచ్చి, అభిషేక్ ఫోన్ నెంబర్ తీసుకొని వెళ్ళాడు.

మరో 20 రోజులు పోయిన తర్వాత, ఒక గాస్పల్ మీటింగ్/క్రిస్మస్ మీటింగ్‌లో ముందువరుసలో తేజని చూసిన అభిషేక్ మనసులోనే దేవునికి వందనాలు చెప్పుకొన్నాడు.

మనం చాలాసార్లు వ్యక్తులతో/విద్యార్థులతో మాట్లాడక వారిని కోల్పోతూ, గెలవలేకపోతున్నాము. మనకి మనం హద్దులు గీసుకొని, అందులోనుండి చూడడం అలవాటు అయ్యింది.

సాధారణంగా మనందరి నోట వచ్చే మొదటిమాట, 'నేటి విద్యార్థులు ఫోన్‌కి అలవాటయ్యారు, చాలా కష్టంగా ఉన్నారు, మాట విననివారు, మాట్లాడినా మాట్లాడరు అంటూ, 'మా రోజులలో' అనే

**అనుకోకుండా ఒకరోజు నా భుజం మీద ఎంతో ఆప్యాయంగా చెయ్యి పడింది. 'తమ్ముడూ' అంటూ సురేష్ అన్న నన్ను పట్టించుకొన్నాడు. హాస్టల్ పైకి తీసుకువెళ్ళి ఎంతో ప్రేమగా మాట్లాడేవాడు. సురేష్ అన్న పేరు చెప్పి ర్యాగింగ్ తప్పించుకొని అన్నతో వెళ్లేవాడిని. ఆ తర్వాత అభిషేక్ అన్న, సుబ్బారావు అన్న, కిషోర్ అన్న నన్ను దేవునిలో స్థిరపరిచారు. కేవలం మొదట్లో ర్యాగింగ్ తప్పించుకోవడానికి బైబిల్ స్టడీకి వెళ్ళేవాడిని. అన్నవాళ్ళు మమ్మల్ని ర్యాగింగ్ నుండి తప్పించి రక్షణ పొందడానికి సహాయపడ్డారు.**

పాతచింతకాయ పచ్చడి ఊకదంపుడు మాటలకు పరిమితమైపోయాము.

ప్రపంచంలో పరిస్థితులు, వ్యవస్థలు మారి పోయాయి, వ్యక్తులు మారిపోయారు. నిజమే, గానీ ట్రెండ్స్, టెక్నాలజి, టీచింగ్ విధానాలు మారినా విద్యార్థుల అంతరంగంలోని అవసరాలు మారలేదు, అంతరంగంలోని వెలితి పోలేదు.

పాపం తెచ్చిన పర్యవసానాలు ప్రతి తరాన్ని తరముతూనే ఉన్నాయి, తాట తీస్తూనే ఉన్నవి. పైకి కన్పిస్తున్నంత సంతోషంగా విద్యార్థులు లేరు అనే సంగతి అర్థం కావాలి. అంతరంగం చాలాసార్లు భయం, ఒంటరితనం, అభద్రత, అపరాధభావన, నిరాశ, నిస్పృహ, డిప్రెషన్, ఆందోళన, అయోమయం... ఇలా గందరగోళానికి గురవుతూనే ఉన్నారు. విద్యార్థులు స్మార్ట్‌ఫోన్‌లో సమయం గడుపుతున్నప్పటికీ, సంతోషం ముసుగులోనే వీటి గుండా పయనిస్తూ ఉన్నారు.

మరి ముఖ్యంగా, కాలేజ్‌కి మొదటి సంవత్సరం వచ్చేవారు మరి ఎక్కువగా వీటి గుండా వెళ్తుంటారు. తెలియని సంతోషం, భయం, బాధ, ఆందోళన, ఆశలతో కాలేజ్‌లో అడుగుపెడతారు. ఆప్యాయంగా, ప్రేమగా మాట్లాడే వారి కోసం, తమను స్వార్థం లేకుండా పట్టించుకొనే వారి కోసం ఎదురుచూస్తూనే ఉంటారు. మన పలకరింపుకోసం, మన చేతి స్పర్శ కోసం, మన సలహా కోసం, మన సహవాసం కోసం ఎదురుచూసేవారు మన కాలేజ్‌లోనే ఉన్నారు, ముఖ్యంగా మొదటి సం॥ము విద్యార్థులు.

కలరింగ్ అంటూ కెరీర్‌ని ఫణంగా పెట్టేవారిని, సరదాల కోసం చెడు అలవాట్ల కోసం స్నేహం చేసే వారిని, అశ్లీలతకు స్మార్ట్ ఫోన్ ద్వారా అమ్ముడుపోయేవారిని, సినిమాలోని తారలను ఇమిటేట్ చేస్తూ... తన సొంత ఉనికిని కోల్పోయేవారిని, అమ్మ నాన్నలను మోసం చేస్తూ, ఇష్టానుసారంగా తిరగాలనుకొనే వారిని.... మంచి మార్గంలో పెట్టడానికి ఇదో మంచి తరుణం.

మొదటి సంవత్సరపు విద్యార్థులను మొదట సంవత్సరములోనే గెలవడం అనేది మన మొదటి లక్ష్యంగా పెట్టుకొని ప్రణాళికబద్ధంగా అడుగులు ముందుకు వెయ్యాలి.మొదటిగా నీవు/మనం క్రైస్తవులమని తెలియనివ్వండి.

**ఎ. అనుసరించాల్సినవి**

1. **పరిచయం పెంచుకోవాలి:** వారిని పరిచయం చేసుకొనే మనసు కావాలి, వారితో మాట్లాడాలి. వారితో స్నేహం చెయ్యాలి. ఇందులో మనకు మనమే చొరవ తీసుకోవాలి. మనదే ప్రధాన పాత్ర.
2. **పరిస్థితులు కల్పించుకోవాలి:** వారితో కలిసి నడవడం, ఆడడం, సంతోషం పంచుకోవడం, వారి హాస్టల్‌కి వెళ్ళడం/రూమ్స్‌కి వెళ్ళడం.
3. **ప్రాబ్లమ్ (సమస్య)ని అర్థం చేసుకోవాలి:** వారు చాలా భయాలతో ఉంటారు, అప్పటికే చాలా చేదు అనుభవాలు ఉంటాయి, అబ్బాయిలు అమ్మాయిల స్నేహం కోసం, అమ్మాయిలు అబ్బాయిల స్నేహం కోసం ఆశపడుతుంటారు, ఇంట్లో సమస్యలు, ఒంట్లో సమస్యలు, అంతరంగంలో సమస్యలు... ఇలా వారు ఎలాంటివారు, సమస్య ఏంటి అని వారిని విమర్శ చెయ్యకుండా అర్థం చేసుకొందాము.
4. **'పంచుకో' సాక్ష్యాన్ని:** వారి సమస్య అర్థం చేసుకొన్న తర్వాత, అవసరం లేదా అవకాశాలు వచ్చినప్పుడు వ్యక్తిగత సాక్ష్యాన్ని, సువార్తతో కలిపి పంచుకోవాలి. చాలా జాగ్రత్తగా మన సాక్ష్యాన్ని పంచుకోవాలి. వారి అభిప్రాయాలను గౌరవించాలి. ఏమాత్రం విమర్శ చెయ్యవద్దు.
5. **'పరిష్కరించు' సందేహాలను:**వారితో కొంత స్నేహం చేసిన తర్వాత, మనమేంటో వారికి అర్థం అవుతుంది. వారేంటో మనకు అర్థం అవుతుంది. వారికి ఉన్న సందేహాలను తీర్చడానికి దేవుని వాక్యాన్ని, గ్రాడ్యుయేట్స్‌ను, పుస్తకాలను వాడుకోవాలి. వారి సందేహాల నివృత్తికై మన ప్రయత్నం ఖచ్చితంగా ఉండాలి, యధార్థంగా ఉండాలి.
6. **'ప్రభువుని' పరిచయం చెయ్యాలి:** వారికి ప్రభువును పరిచయం చేయడానికి చేసిన ప్రయత్నాలు ఆశాజనకంగా ఉంటే, ఇంకా ఎక్కువగా చెప్పడానికి రాబోతున్న క్రిస్మస్ మీటింగ్స్/ గాస్పల్ మీటింగ్స్‌కి వారిని ఆహ్వానించవచ్చు. తర్వాత ప్రభువు జనన, మరణ, పునరుత్థానాల గూర్చి వారికి వివరించాలి.
7. **'ప్రార్థన' చెయ్యాలి:** వారి గూర్చి విధిగా ప్రార్థించాలి. మన గ్రాడ్యుయేట్స్‌కి వారి పేర్లు ఇచ్చి ప్రార్థించమని చెప్పాలి. ప్రార్థన ద్వారా వారిని ప్రభువుకు అప్పగించాలి.
8. **'ఫాలోఅప్' చెయ్యాలి:** వారు ప్రభువును అంగీకరించిన తర్వాత చక్కగా స్థిరపడేటట్లు బైబిల్ స్టడీస్‌కు, గ్రాడ్యుయేట్స్ దగ్గరికి, మీటింగ్స్‌కి, మనము వెళుతున్న సంఘ సహవాసానికి తీసుకెళ్ళాలి.
9. **'ప్రభువులో' స్థిరపరచాలి:** ప్రార్థన చేసుకోవడం, వాక్యం చదువుకోవడం నేర్పించాలి. సరైన బోధలో, సిద్ధాంతాలలో, విశ్వాసంలో, పరిశుద్ధతలో ఎదిగేటట్లు మనం చొరవ తీసుకోవాలి.
10. **'పరిచర్యకు' ప్రోత్సహించాలి:** దేవుని కృపతో, ఇయు పరిచర్య ఆవశ్యకతను, అవసరాన్ని తెలియజేస్తూ పరిచర్యలో పాల్గొనేటట్లు ప్రోత్సహించాలి.

వీటన్నిటికి మించి మనందరికి ప్రేమ, రిస్క్ తీసుకునే మనసు కావాలి. "క్రీస్తు ప్రేమ మమ్మల్ని బలవంతము చేయుచున్నది" (2 కొరింథీ 5:14-15) అనే మాటలను, ఆయన మాదిరిని జ్ఞాపకం చేసుకొందాము.

నవ్వుతూ నరకానికి వెళ్తున్న విద్యార్థులను క్రీస్తు కోసం సంపాదించడానికి శ్రమపడదాము.

## బి. అనుసరించకూడనివి

1. **సరియైన సిద్ధపాటు లేకపోవడం:** ప్రార్థన, వాక్యధ్యానం, వ్యక్తిగత పరిశుద్ధత లేకుండా, దేవునితో సరియైన సహవాసం లేకుండా, సరియైన సిద్ధపాటు లేకుండా విద్యార్థులను గెలవడం అనేది కష్టతరమైంది.
2. **వారి సహవాసంలోకి మనం వెళ్ళకూడదు:** ఎవరికైతే సువార్త చెప్పాలని ఆలోచించి, ఆశపడుతున్నామో వారితో స్నేహం చెయ్యాలి, దాన్ని కొనసాగించాలే గానీ, వారి సహవాసంలోకి మనం వెళ్ళకూడదు. మనం ప్రత్యేకంగా ఉండాలి.
3. **సరిగా తెలియనివి చెప్పడం:** వారితో స్నేహం చేస్తున్నప్పుడు మనకు సరిగా తెలియని శ్లోకాలు, ఫిలాసఫి మాటలు చెప్పడం, నిరూపించలేక, న్యాయం చేయలేక చేతులెత్తేయడం లాంటివి చెయ్యకూడదు.
4. **సరియైన వ్యక్తులు కాకపోవడం:** అబ్బాయిలు అమ్మాయిలకు సువార్త చెప్పాలనుకోవడం, అమ్మాయిలు, అబ్బాయిలకు సువార్త చెప్పాలనుకోవడం వలన ఎన్నో అనర్థాలు కొని తెచ్చుకొంటాము. ఇలాంటివి చేయకూడదు.
5. **సరియైన చొరవ తీసుకోకపోవడం:** సహజముగా మన దగ్గరికే వ్యక్తులు రావాలని చూస్తాము, కాని మనమే చొరవ తీసుకొని వారి దగ్గరకు వెళ్ళాల్సిన అవసరం చాలా ఉంది.
6. **సహనం లేకపోవడం:** వారు పరిచయం అయిన వారంలోపు మీటింగ్‌కి రావాలని, వచ్చి రక్షింపబడి, పరిచర్యలో కొనసాగాలని ఆశ మంచిదే కాని, దానికి సమయం పడుతుంది. దాని కోసం సహనంతో ఎదురుచూడాల్సిందే.
7. **సరికానివి మాట్లాడడం:** చాలాసార్లు అనవసరమైన మాటలు, వాగ్వివాదాలు చర్చలు మనల్ని వారికి దూరం చేస్తాయి. దేవుని బిడ్డలం కాబట్టి చాలా హుందాగా ప్రవర్తించాలి, అలానే మాట్లాడాలి. కానీ...మన బతుకులు వేసే కేకలలో మనం చెప్పే మాటలు వినిపించవు. అందుకనే మన మాటలు, ప్రసంగాలకంటే మన జీవితం, జీవితపు విధానాలు చాలా ప్రభావం చూపుతాయి.

## సి) అనుభవం

అది 1999 రాజమండ్రి జిఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజ్‌లో దాదాపు 344 కి.మీ. ప్రయాణం చేసి అడుగుపెట్టిన తొలి దినాలు. అప్పటిలో ర్యాగింగ్ ముమ్మరంగా జరిగేది. దాదాపు 3 నెలలు ఎక్కువగా ర్యాగింగ్ చేసేవారు. నేను ఒక్కడినే కొడుకుని, నలుగురు ఆడపిల్లల మధ్యలో చాలా గారాభంగా పెరిగాను. అంతదూరం రావడం జీవితంలో మొదటిసారి. ర్యాగింగ్ కోసం జిల్లాలుగా వేరైపోయేవారు. ఏడవని రోజు లేదు అంటే అతిశయోక్తి కాదు. చాలాసార్లు బాత్‌రూమ్‌కి వెళ్ళి ఏడ్చేవాడిని, అసలు ఉండాలని లేదు, అమ్మ గుర్తుకు వచ్చేది. చిన్నపాటి నరకాన్ని చూశాను. 72 రూమ్‌లు, 6 బ్లాక్‌లు ఉండేవి, ఉదయాన్నే లేచి ప్రతి రూమ్‌కి వెళ్ళి నమస్తే అన్న అంటూ కనిపించిన వారికందరికి సెల్యూట్ చేసి రావాలి. బిక్కుబిక్కుమంటూ భయం భయంగా గడుపుతున్న రోజులవి.

అనుకోకుండా ఒకరోజు నా భుజం మీద ఎంతో ఆప్యాయంగా చెయ్యి పడింది. 'తమ్ముడూ' అంటూ సురేష్ అన్న నన్ను పట్టించుకొన్నాడు. హాస్టల్ పైకి తీసుకువెళ్ళి ఎంతో ప్రేమగా మాట్లాడేవాడు. సురేష్ అన్న పేరు చెప్పి ర్యాగింగ్ తప్పించుకొని అన్నతో వెళ్లేవాడిని. ఆ తర్వాత అభిషేక్ అన్న, సుబ్బారావు అన్న, కిషోర్ అన్న నన్ను దేవునిలో స్థిరపరిచారు.

కేవలం మొదట్లో ర్యాగింగ్ తప్పించుకోవడానికి బైబిల్ స్టడీకి వెళ్ళేవాడిని. అన్నవాళ్ళు మమ్మల్ని ర్యాగింగ్‌నుండి తప్పించి రక్షణ పొందడానికి సహాయపడ్డారు.

దేవుని ప్రేమ, మహాకృపను బట్టి ఒక గాస్పల్ రిట్రీట్‌లో దేవుడు నన్ను రక్షించుకొన్నాడు. ఈ రోజుకి దేవునిలో ఉంటూ తన పరిచర్యలో వాడుకొంటున్నాడు.

ర్యాగింగ్ లేకపోయినా, ఆప్యాయంగా పలకరించిన అన్న లేకపోయినా, ఇయు పరిచర్య లేకపోయినా, రక్షణపొందేవాడిని కాదేమో అని చాలాసార్లు అనుకొంటాను. అయితే దేవుడు తన ప్రణాళికలో వీటన్నింటిని, వీరందరిని వాడుకొని నన్ను రక్షించుకొన్నాడు... దేవునికే మహిమ కలుగును గాక.

**– యం. గాలెయ్య,** భీమవరం

(ఇవాంజిలిజమ్ అండ్ టెస్టిమొని డిపార్ట్‌మెంట్ తరఫున)

"Fear of the LORD is the beginning of knowledge"

EXCLUSIVE OFFER FOR CHRISTIAN STUDENTS/FAMILIES

# STUDY MBBS IN KYRGYZSTAN



**MEDIUM: ENGLISH**
**CURRICULUM: INTERNATIONAL**
**LOCATION: BISHKEK [CAPITAL]**

ADMISSIONS ARE OPEN FOR FALL, 2022.
ADMISSIONS FOR SPRING, 2023
WILL BE OPENED SOON

While studying medicine,
you can be a 'witness' to international students!

## SALYMBEKOV MEDICAL COLLEGE

1st year total cost* Rs.5,60,000 = USD 6830
2nd year total cost* Rs.approximately Rs.4,50,000 [5+1 <Rs.30,00,000]
**Website:** https://salymbekov.com
Need a pass in 10+2 and have NEET qualifying marks!

***The above totals include admission, tuition, hostel, mess, visa, documentation, medical insurance, consultancy and processing fee, but exclude flight charges.**

**Note:**
(1) Total costs can be paid in two instalments.
(2) Payments are in US Dollars. Prices are calculated @ $1=Rs.82

**STUDY OF MEDICINE STARTS FROM FIRST YEAR WITHOUT ONE YEAR OF PREPARATORY COURSE**

**CURRENTLY MORE THAN 10,000 INDIAN STUDENTS STUDY MEDICINE IN KYRGYZSTAN**

**RECOGNISED BY WORLD HEALTH ORGANISATION (WHO)**

**AFFORDABLE FEES IN COMPARISON TO OTHER MEDICAL COLLEGES**

**UKRAINE-RETURNED STUDENTS CAN CONTINUE MEDICINE**

**COLLABORATION WITH MEDICAL COLLEGES IN OTHER COUNTRIES**

**FOR MORE INFORMATION CONTACT US:**

**+91-9618952707 (Only WhatsApp)**
**doctorlukeconsultancy@gmail.com**

**Address in Kyrgyzstan:** Standard Service Plus, 2/7 Avezova Street, Bishkek, Kyrgyzstan





# ఆత్మీయ జ్వాల

స్పైకాన్ మొదలైంది. 'అన్నా బాగున్నావా', 'అక్కా బాగున్నావా', 'ఎన్నాళ్ళయిందో మనం కలిసి', 'ఏన్నేళ్ళయిందో నిన్ను చూసి' లాంటి పలకరింపులతో ఆ ప్రాంగణమంతా పులకరించిపోతోంది. పట్టణానికి పది కిలోమీటర్ల దూరంలో, ఆకాశాన్ని తాకాలని ఆరాట పడుతున్నట్లున్న కొండలతో, పచ్చని పట్టుచీర కట్టుకున్నట్లున్న ప్రకృతి ఒడిలో అలరారుతున్న ఆ ప్రాంతమంతా దేవుని ఆత్మీయతను అనుభవించడానికి ఆహ్వానం పలుకుతున్నట్లుగా ఉంది.

పిల్లల్నేసుకొని జంటలుగా వస్తున్న దంపతులకు ఎదురెళ్ళి వాళ్ళను ఆత్మీయంగా హత్తుకుంటూ ఆహ్వానం పలుకుతూ మనసులన్నీ మురిసిపోతున్నాయి. మూడేళ్ల తర్వాత కలిశారేమో, కరోనా కోరల్లో చిక్కి విలవిల్లాడిన ప్రాణాలు కాస్త తెరిపిన పడ్డాయేమో ఒక్కొక్కరిలోనూ ఏదో తెలియని ఉద్విగ్నత.

దసరా సెలవులకు సొంత ఊళ్ళకు, ఇళ్ళకు వెళ్ళలేకపోయామన్న బెంగ ఒక్కర్లోనూ లేదు. ఎవరికి ఎవరూ బంధువులు కాకపోయినా, ఒకరి కొకరికి ఏ విధమైన సంబంధం లేకపోయినా... ఎన్నో ఏళ్ళనుండీ ఏదో తెలియని ఆత్మీయబంధంలో చిక్కుబడిపోయిన కుటుంబసభ్యుల్లా ఒకర్నొకరు పలకరించుకొంటున్నారు.

ఆకాశం గంభీరంగా ఉంది. ఆత్మీయ జల్లులే తప్ప వానజల్లుల జాడలేదు!

❄ ❄ ❄

"సమాధానమను బంధము చేత ఆత్మ కలిగించు ఐక్యతను కాపాడుకొనుటయందు శ్రద్ధ కలిగిన వారై, ప్రేమతో ఒకనినొకడు సహించుకొనుడి' (ఎఫెసీ 4:1) వేదిక మీద పెద్ద అక్షరాలతో రాసిన బ్యానర్ అందర్నీ ఆకర్షిస్తున్నట్లుగా ఉంది. తెలుపు, నీలంరంగు బెలూన్స్‌ను బ్యానర్ మీదుగా చుట్టూ అలంకరించారు. వేదిక మీద సింగింగ్ టీం ... థీమ్ సాంగ్స్ పాడుతూ దేవుని మహిమపరుస్తున్నారు. వేదిక ముందు కుర్చీలలో కూర్చున్నవాళ్ళంతా చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా థీమ్ సాంగ్ వల్లెవేస్తున్నారు.

కుర్చీలలో ఒక చివర కూర్చున్నాడు నిర్మల్. దేవుని కార్యాన్ని పదేపదే గుర్తు చేసుకోవడంతో రెండు కళ్ళూ చెమ్మగిల్లాయి. విద్యార్థుల పరిచర్యను, గ్రాడ్యుయేట్స్ సహవాసాన్ని ఆ దేవుడు తనకు బహుమతిగా ఇచ్చినందుకు అతని మనసు దేవుని పట్ల కృతజ్ఞతతో నిండిపోయింది.

సంవత్సరం క్రితం అదే రోజున వచ్చిన తీవ్రమైన అనారోగ్యం కారణంగా దాదాపు చావు అంచుల వరకూ వెళ్ళొచ్చాడు. కరుణామయుని కృపతో

మళ్ళీ బలంపొందుకొన్నాడు. ఇంతమందితో, అంత పెద్ద సమావేశంలో పాల్గొంటాడని అతను కలలో కూడా అనుకోలేదు. బతకడానికి, చనిపోవడానికి మధ్య దేవుని కరుణ ఎంతగా కాపాడుతుందో ప్రత్యక్షంగా అనుభవించాడు. పరమ వైద్యుడిగా తనను తాకి, చావుగోతినుండి విడిపించి మళ్ళీ అందరితో ఆయనను ఆరాధించడానికి సజీవుడిగా తనను బతికించినట్లుగా అనిపించింది నిర్మల్‌కి. ఆలోచనలలోనుండి బయటపడి వాక్యం వైపు దృష్టి సారించాడు. వ్యక్తుల మధ్య, సంఘాల మధ్య ఉండవలసిన ఐక్యత గురించి ప్రవాహంలా సాగిపోతున్న వాక్యం సూటిగా గుండెల్ని తాకింది. వాక్యం ద్వారా దేవుడు మాట్లాడితే ఎలా ఉంటుందో మళ్లీ అనుభవంలోకి వచ్చింది నిర్మల్‌కి. దేవునితోనూ, తోటి వ్యక్తులతోనూ, సంఘస్థులతోనూ ఏ విధమైన సంబంధాలను కలిగివుండాలో వాక్యపు ఆధారాలతో చెప్పున్న అన్న వైపు చూస్తూ తనను తాను పరీక్షించుకోసాగాడు నిర్మల్.

నిజమే... ఐక్యత అంటే దేవుని వాక్యాన్ని పాటిస్తూ, దేవుని చిత్తాన్ని నెరవేర్చుతూ మన సహనాన్ని ఇతరులకు తెలియజేస్తూ క్షమాగుణాన్ని కలిగి ఉండడమే కదా! మనకు నచ్చిన వాళ్ళతో మంచిగా ఉంటూ, మనపట్ల నిర్లక్ష్యంగా ప్రవర్తించే వారిపట్ల ద్వేషంతో ఉండడం ఐక్యత అనిపించుకొంటుందా? వ్యక్తుల మధ్య ఐక్యత లేదు. మాదిరికరంగా ఉండాలని తపించిన వాళ్ళను కూడా ఏవో బలహీనతలు వెంటాడుతున్నాయి. ఆధిపత్యపు ధోరణో, స్వార్థమో మనుషుల్ని పట్టిపీడిస్తోంది. అన్యులకు దేవునిని పరిచయం చేయాల్సిన సోదరులంతా దేవునిని ఎరుగని అన్యజనుల్లాగా ప్రవర్తిస్తున్నారు. ఇలాంటి ప్రవర్తన వల్ల దేవుడు మహిమ పరచబడతాడా?

ఎన్ని స్పైకాన్స్ జరిగుంటాయి. ఎన్నిసార్లు ఐక్యత గురించిన వాక్యం తాను విని ఉంటాడు. అయి నా 'సహోదరులతో ఐక్యత కలిగి ఉండడం ఎంత మేలు, ఎంత మనోహరమనే వాక్యాన్ని తానెందుకు మర్చిపోతున్నాడు. విన్న ప్రతిసారీ వాక్యం కొత్తగా, హృదయంలో గొప్ప కార్యం చేసినట్లుగా అనిపిస్తుంటుంది. విడిచిపెట్టి బయటికి వెళ్తే మళ్లీ లోకం వెంటపడి పీడిస్తుంటుంది.

ఒక్కసారి కళ్ళుతిప్పి చుట్టూ చూశాడు. వచ్చిన

**కాసేపు మన ఆధిక్యతలను, ఇగోల ను, సంపదలను పక్కనబెట్టి అన్నిటిని అనుగ్రహించిన దేవునివైపు చూడడంలో ఎంత ఆనందం ఉంటుందో, కుటుంబంలో, సంఘంలో ఐక్యత లేదని బాధపడడం కంటే, ఐక్యత లేకపోవడానికి మనం ఎంతవరకూ కారణమో గ్రహించాడు.**

డెలిగేట్స్ అంతా మైమరచిపోయి వాక్యంలో లీనమై కనిపించారు. ఒకరితో ఒకరు ఆప్యాయంగా పల కరించుకొనే వీళ్ళందరి మధ్యా నిజమైన ఐక్యత ఉందా? వాళ్ళు హాజరయ్యే ఇయు, ఇజియఫ్, సంఘాలలో, అక్కడ తీసుకొనే నిర్ణయాల్లో, విద్యార్థుల్ని నడిపించే విషయాల్లో ఒకరికొకరు ఐక్యంగా కొనసాగుతున్నారా? లేక అనైక్యతతో పరిచర్యకు వీళ్ళే అడ్డంకులు సృష్టించుకొంటున్నారా? తన మాటే నెగ్గాలనో, తనను అందరూ గుర్తించాల నో కోరుకొంటూ దేవుని పోలి నడుచుకోవడం మర్చిపోతున్నారా?

ప్రశ్నలన్నీ ఒక్కసారిగా ఉక్కిరిబిక్కిరి చేయసాగాయి. 'నీకు అభ్యంతరకరమైనది ఏదీ నాలో లేకుండా తీసివేయి' అని ప్రార్థించే మనమే బలహీనులమైపోతే దేవుని బలాన్ని గుర్తించడంలో ఇంకా గుడ్డితనంలో ఉన్నట్లేగా! వాక్యం చెప్పున్నట్లు మనమంతా చెడ్డపనులు చేయడానికి గుంపుగా కూడుతున్నాం. నిరపరాధుల ను చంపడానికి తొందరపడుతున్నాం. కీడు చేయడానికి పరిగెడుతున్నాం. లేని వాటిని కల్పించి అబద్ధసాక్ష్యాలు చెప్పడంలో ఆరితేరిపోతున్నాం .వాక్యాన్ని విన్నట్లే నటిస్తున్నాం కానీ పాటించడంలో విఫలమవుతున్నాం. మన ప్రవర్తన ద్వారా మనమే దేవునిని దు:ఖపరచడంలో ముందుంటున్నాము.

❄ ❄ ❄

స్పైకాన్ చివరిరోజు...

చూడముచ్చటగా ఒకరిపక్కనొకరు జంటలుగా కూర్చున్న భార్యాభర్తల్ని చూస్తూ వెనుక వైపున్న కుర్చీలో కూర్చున్నాడు నిర్మల్. వాక్యం మొదల య్యింది. ఇల్లనే చెట్టుకు నీరుపోసి బతికించేవాళ్లు భార్యాభర్తలు! అటువంటి భార్యాభర్తల మధ్య

ఐక్యత లోపిస్తే కుటుంబం విచ్ఛిన్నమవుతుంది. నలుగురిలోనూ హేళన చేయబడతారు. పిల్లల మీద సరైన ప్రేమను చూపించలేక, సరిగా వారిని పెంచలేక వారు దారి తప్పడానికి కారణమవుతారు. అన్నిటిని మించి 'పెళ్ళి' పేరుతో వారిరువురినీ ఏక శరీరంగా చేసిన దేవుని నామానికి అవమానం కలుగుతుంది.

'తెరచిన గృహాల' ద్వారా ఎంతోమంది విద్యార్థుల్ని దగ్గరకి తీసుకునే భార్యాభర్తల మనసులు విశాలంగా ఉండాలి. ఒకరి పట్ల ఒకరికి అనురాగం ఉండాలి. ఒకరిని ఒకరు భరించాలి, తప్పుల్ని సహించాలి. భార్యల్ని ప్రేమించడంలో భర్తలు ముందుండాలి. భర్తలకు లోబడడాన్ని భార్యలు నేర్చుకోవాలి. అంతిమంగా భార్యాభర్తలిద్దరూ... దేవుని నామాన్ని ఘనపరిచే బిడ్డలుగా తయారవ్వాలి. అప్పుడే ఆ కుటుంబానికి సార్థకత, దేవుని ప్రణాళికకు ఘనత! వాక్యం వింటున్నంతసేపూ తన బలహీనతలు కళ్లముందు తిరుగుతూనే ఉన్నాయి. తనను సూటిగా ప్రశ్నిస్తూనే ఉన్నాయి. వాక్యాన్ని పాటించడంలో చూపించే నిర్లక్ష్యాన్ని గుర్తుచేస్తూనే ఉన్నాయి. అయినా తానెక్కడో తప్పిపోతున్నాడు? ఇతరులతో ఐక్యంగా ఉండడంలో, సంపూర్ణంగా ప్రేమించడంలో దారి తప్పుతున్నాడు. దేవుడు తన మాదిరిగా ఉండాలని ఆరాటపడుతున్నాడు గానీ ఇతరులకు తాను మాదిరికరంగా ఉండడంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నాడు. ఆలోచనలకు స్వస్తిచెప్పి వేదిక చుట్టుపక్కల చూశాడు. మనసు ప్రశాంతంగా అనిపించింది. కాసేపు మన ఆధికత్యలను, ఇగోలను, సంపదలను పక్కనబెట్టి అన్నిటినీ అనుగ్రహించిన దేవునివైపు చూడడంలో ఎంత ఆనందం ఉంటుందో, కుటుంబంలో, సంఘంలో ఐక్యత లేదని బాధపడడం కంటే, ఐక్యత లేకపోవడానికి మనం ఎంతవరకూ కారణమో గ్రహించాడు.

అందరితో పాటే లేచి మీటింగ్ హాల్లో నుండి బయటికి వచ్చాడు నిర్మల్. అప్పటివరకూ గంభీరంగా ఉన్న ఆకాశంలో ఏదో కదలిక... ఆత్మీయ జల్లులతో పాటు చిరుజల్లులు కూడా మొదలయ్యాయి.

– డా. జడా సుబ్బారావు, నూజివీడు

# Crossword Puzzle




*Please find out the hidden words in the puzzle using the clues/hints and send to Nambur office within 15 days.*

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1 | | | | 2 | | 3 |
| 4 | 5 | ■ | 6 | | ■ | |
| | | 7 | | | | |
| 8 | | | | | | |
| | 9 | | | | | |
| 10 | | | | | | |

**Horizontal**
1. The man who is always linked with his wife
7. The son of Jaaziah, a Merarite
8. The 2nd son of Moses & Zipporah
9. The grandson of Levi, who died at 137 yrs age
10. The man who loved to evangelize

**Vertical**
2. A Benjamite, the fatherof Shuppin & Happim
3. The man who was the first missionary
4. The son of Elpaal, a Benjamite
5. The first king of Edom, eldest son of Benjamin
6. The descendent of Shem through Arhaxad

**Last month key:**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| J | A | B | E | Z | N | ■ | ■ |
| ■ | R | E | C | H | A | B | R |
| N | ■ | L | ■ | ■ | P | I | E |
| A | M | I | C | A | H | L | U |
| B | ■ | J | ■ | ■ | T | D | B |
| A | D | A | L | I | A | A | E |
| L | ■ | H | ■ | ■ | L | D | N |
| N | E | H | E | M | I | A | H |

1. *M. Ankarao, Guntur*
2. *T. Anand Babu & Koteswari, Chilakaluripet*
3. *R. Suma Srinivas, Staff, Guntur*
4. *T. Anna Mani, Gudivada*

## కోశాధికారి లేఖ

# ఐశ్వర్యం

క్రీస్తునందు ప్రియమైన యుఇయస్ఐ-ఏపి కుటుంబ సభ్యులకు, కోశాధికారులకు, ప్రార్థనా సహకారులకు మన ప్రభువైన యేసుక్రీస్తు నామంలో వందనాలు.

*"మీరు మన ప్రభువైన యేసుక్రీస్తు కృపను ఎరుగుదురు గదా? ఆయన ధనవంతుడై యుండియు మీరు తన దారిద్ర్యము వలన ధనవంతులు కావలెనని, మీ నిమిత్తము దరిద్రుడాయెను." -2 కొరింథీ 8:9*

దేవుని కృప మన జీవితాల్లో పని కలిగి ఉండడమే గాక క్రీస్తు కృప మనం ఆయనను పోలి ఉండేలా సవాలు చేస్తుంది. మనమాయన దారిద్ర్యం ద్వారా ధనవంతులు అవ్వాలని మన పేదరికాన్ని బట్టి క్రీస్తు తన ఐశ్వర్యాన్ని విడనాడాడు. దీన్ని మనం పదార్థ సంబంధిత ఐశ్వర్యంగా లేక పేదరికంగా అర్థం చేసుకోకూడదు. ఆయన నరావతారిగా రావడంలోనూ, సిలువ మరణాన్ని అనుభవించడంలోనూ యేసుక్రీస్తు దారిద్ర్యాన్ని మనం చూడగలిగితే, ఆశీర్వాదలతో నిండుకొని ఉన్న రక్షణను మనకు ప్రసాదించడమే ఆయన ఇచ్చే 'ఐశ్వర్యం' అని గ్రహించగలం. గనుక సిలువ విలువను అర్థం చేసుకొని దాతృత్వం కలిగి ఉందాం.

**గమనిక:** జూన్ నెల 2022లో జరిగిన రాష్ట్ర వార్షిక కౌన్సిల్ (ఏసియం 2022) నిర్ణయం ప్రకారం రాష్ట్రంలోని ప్రతీ ఇయు, ఇజియఫ్ పరిచర్య కోసం పంపించే మంత్లీ కాంట్రిబ్యూషన్‌ను ఏ.పి. స్టేట్ అకౌంట్‌కు పంపించాలని, రాష్ట్ర మరియు నేషనల్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని సమకూడిన మొత్తాన్ని ఎగ్జిక్యూటివ్ కమిటీ విభజించి పంపడానికి, కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ కమిటీకి అనుమతినిస్తూ తీర్మానం చేయడం జరిగింది. కాబట్టి పరిచర్యకు ప్రతి నెలా పంపించే కాంట్రిబ్యూషన్‌ను విభజించకుండా మొత్తాన్ని ఏ.పి. స్టేట్ అకౌంట్‌కు పంపించాలని మనవి.

**స్తుతించండి**

1. మన స్టాఫ్‌కు 100% శాలరీ, అలవెన్స్‌లు ఇవ్వడానికి ప్రభువు చూపిన కృపను బట్టి

**ప్రార్థించండి**

1. యుఇయస్ఐ-ఏపి ఏసియం-2022 తర్వాత పెరిగిన 16.53% బడ్జెట్‌కు అనుగుణంగా ఇజియఫ్‌లు కాంట్రిబ్యూషన్స్ పెంచి పంపేటట్లు
2. స్టెరెట్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కోసం 8 లక్షలు, చాందపిళ్ళ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కొరకు 5 లక్షలు అవసరం
3. యుఇయస్ఐ నేషనల్ వేతన సవరణలకు అనుగుణంగా మన స్టాఫ్‌కు కూడా వేతనాలు పెంచడానికి ఏసియం 2022 నిర్ణయించారు. దీని అవసరత ప్రతి నెల రూ. 70,000/- పెరుగుతుంది.
4. స్టాఫ్‌కు ఐదు ల్యాప్‌టాప్‌లు సబ్సిడీలో ఇవ్వడానికి అవసరమైన 1,20,000/- కొరకు

ఇట్లు
క్రీస్తులో మీ సహోదరుడు

**యస్.ఆర్.డి. కిషోర్ కుమార్**

**AP MONTHLY REQUIREMENT – Rs. 11,41,000/- (16.53% Hike W.R.T present income)**
**MONTHLY REQUIREMENT FOR UESI NATIONAL – Rs. 4,32,000/-**
**TOTAL - 15,73,000**

## AUGUST 2022

| Receipts | | Payments | |
|---|---|---|---|
| Opening Balance | 99.00 | Field Staff Salaries | 4,84,735.00 |
| General Fund | 13,99,707.00 | Field Staff HRA, CA, MA & TA | 3,11,182.00 |
| Staff Support | 38,500.00 | Office Staff Salaries | 1,84,189.00 |
| | | UESI | 2,50,000.00 |
| | | Rajasthan | 30,000.00 |
| | | Jammu & Kashmir | 15,000.00 |
| | | APEGF | 3,000.00 |
| | | Girls Depatment | 3,500.00 |
| | | To Gratuity | 50,000.00 |
| | | Office Expenditure | 44,589.00 |
| | | SWF | 62,000.00 |
| | | Closing Balance | 111.00 |
| **Total** | **14,38,306.00** | | **14,38,306.00** |

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No. : **GTR/59/2021-2023**

**Date of Printing: 25-10-2022**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508



# చేదైనవేరు

వానాకాలానికి ఎండగిట్టదు
ఎండాకాలానికి మంచుగిట్టదు
లోకానుసారికి వాక్యమంటే గిట్టదు

ఆత్మీయ హలాలకు విశ్రాంతి లేదు
అలుపు లేక కలుపుతీసే రైతన్నలకూ
ఏపుగా పెరగాలని వేసే ఎరువులకూ
ఏ కొరతా లేదు

ఏ చేదు వేరు మొలిచిందో
చేనంతా విస్తరిస్తూంది
ఏ చీడపురుగు పట్టిందో
పొలాలన్నీ పాకి పోతుంది

కయీనులా తోటి సోదరులమీద
కనిపించని కసి
పెంచుకొంటున్నామేమో!
నాలుకనే ఆయుధంగా ఉపయోగిస్తూ
నామరూపాల్లేకుండా చేసుకొంటున్నాం

ఏశావులా ఏ రుచుల మీద
మోజు పెంచుకొంటున్నామో!
ఆశీర్వాదాలను పోగొట్టుకొంటూ
అనవసరపు అసూయను
అలవాటు చేసుకొంటున్నాం

సంఘాల్లో సహవాసపు ఆకులు
పచ్చగానే ఉన్నాయి కదా...
సంపూర్ణ సంతోషం దొరుకుతుందని
వచ్చేవారిని స్వార్ధంతో
మోడు బారేలా చేస్తున్నాం

ఆత్మఫలాలతో ఆకలి
తీర్చుకొందామని వచ్చేవారికి
కారు ఫలాలను
కనికరం లేకుండా పంచుతున్నాం

కారణాలేంటో తెలుసుకొందాం
మన సమూహాల్లోని ఆంతర్యాన్ని
లోతుల దాకా తవ్వి చూద్దాం
చేదైన వేరును
చివరిదాకా పెరికి వేద్దాం
ప్రేమ, ఐక్యతల తియ్యని ఫలాలు ఫలిద్దాం
నిజమైన ద్రాక్షావల్లికి
నిత్యం అంటు కట్టబడదాం.

– గొంగటి మేరీ జాయ్, ఆదోని